




కాలువలో పెరిగిన కంప చెట్లు

నీరు.. పారేదెలా?

మరమ్మతులు శూన్యం

నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలోని మేజర్లు, మైనర్‌లు, సబ్‌మైనర్ కాలువలు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. కాలువలు కనీస మరమ్మతులకు నోచుకోలేదు. గుర్రపుడెక్క, జమ్ము, రబ్బరు మొక్కలు, కంపచెట్లు కాలువల నిండా పెరిగాయి. ఇవి నీటి సరఫరాకు అవరోధంగా మారాయి. మరమ్మతులు చేపట్టేందుకు 212 పనులు గుర్తించి జలవనరుల శాఖ రూ.34 కోట్లకు వ్యయం అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా నిధులు విడుదల చేయలేదు. దీంతో కాలువలు మరమ్మతులకు నోచుకోలేదు.



షట్టర్లు లేని తూములు

సాగర్ ఆయకట్టు వివరాలు..

జిల్లా	ఆయకట్టు ఎకరాల్లో
పల్నాడు	5,63,647
గుంటూరు	95,851
బాపట్ల	1,88,459
మొత్తం	8,47,957

- సాగర్ కాలువల్లో పూడిక తీసేదెప్పుడు...?
- గత సీజన్‌లో నిధులు ఇవ్వని ప్రభుత్వం
- మొదలైన పంటల సీజన్
- ఇప్పటికీ గుర్తించని పనులు.. సిద్ధం కాని ప్రతిపాదనలు
- నాలుగేళ్లుగా రూపాయి విడుదల చేయని ప్రభుత్వం



కాలువలో గుర్రపు డెక్క



రూపురేఖలు కోల్పోయిన మైనర్ కాలువ

రైతులకు ఏటా రూ.వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తున్నాం.. అన్నదాతకే మొదటి ప్రాధాన్యం.. అంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. అదంతా చేతల్లో కనిపించడం లేదు. నిజంగా రైతుల పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో చెప్పడానికి కాలువల్లో పూడికతీతే ఉదాహరణ. పంటల సీజన్ మొదలు కావస్తున్నా కనీసం పూడిక కూడా తీయలేని దుస్థితిలో ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసు కోచ్చు. ఏటా ప్రధాన కాలువల్లో పూడిక, కంపచెట్లు తొలగిస్తుంటారు. దెబ్బతిన్న కట్టడాలను పునరుద్ధరిస్తారు. కానీ ఆ ఊసేలేదు. కాలువల్లో చేపట్టాల్సిన అత్యవసర పనులను ఇప్పటి వరకు జలవనరుల శాఖ గుర్తించలేదు. అయితే పనులు చేపట్టేందుకు ఏకంగా ప్రభుత్వమే అనుమతివ్వడం ఆపేసింది. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పరిశీలిస్తే ఈ ఏడాది కాలువలకు మరమ్మతులు లేనట్లేనని చెప్పవచ్చు. వరుసగా నాలుగవ ఏడాది ప్రభుత్వం సాగర్ కాలువల్లో అత్యవసర పనులను చేపట్టడాన్ని విస్మరించింది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంట కాలువల్లో నీరు సజావుగా పారాలంటే సీజన్లో పూడిక తీయడంతోపాటు కాలువల్లో పెరిగిన జమ్ము, కంపచెట్లు తొలగించాలి. అప్పుడే చివరి ఆయకట్టు వరకు నీరందుతుంది. ఏటా ఖరీఫ్ ప్రారంభంలోనే ఈ ప్రక్రియకు టెండర్లు పూర్తి చేస్తారు. కాలువలకు నీరు విడుదల కంటే ముందే పనులు పూర్తి చేస్తారు. ఏటా ఇది జరుగుతుండగా గత మూడేళ్లుగా ఆ పరిస్థితి లేదు. గత ఏడాది కాలువల్లో పనులు చేపట్టేందుకు జలవనురుల శాఖ అందించిన ప్రతిపాదనలను ప్రభుత్వం తిరస్కరించింది. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం)కు పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాలలో పరిధిలోని లింగంగుంట్ల, ఒంగోలు సర్కిల్స్ నుంచి అధికారులు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం వాటిని తిరస్కరించింది. గత ఏడాది సాగు నీటి సంక్షోభంతో సాగు నీరు సరఫరా కాలేదు. కాలువల్లో నీరు పారుదల లేకపోవడంతో అవి అధ్వాన స్థితికి చేరాయి. కాలువల్లో పూడిక తీయాలంటూ రైతులు పలుమార్లు వేడుకుంటున్నా ప్రభుత్వం స్పందించడంలేదు. మరో రెండువారాల్లో ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభం కానున్నాయి. చివరి ఆయకట్టు వరకు సాఫీగా నీరు పారాలంటే కాలువలను సిద్ధం చేసుకోవాలి. వేసవికాలం కూడా కావడంతో పూడిక తీయకపోతే సాగు కష్టమ వుతుందని నిపుణులు అంటున్నారు.

షట్టర్లు లేక నీరు వృధా

కాలువల్లో కంప చెట్లు పెద్దఎత్తున పెరిగాయి. జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలు కాలువల నిండా అల్లుకుపోయాయి. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు కూగా దెబ్బ తిన్నాయి. పూర్తిగా అధ్వాన స్థితిలో కాలువలు ఉన్నాయి. షట్టర్లు లేక పోవడంతో సాగు నీరు వృధాగా వాగుల్లో పారుతోంది. దీని వలన అవసరం ఉన్నా లేకున్నా నీటి సరఫరా జరుగుతోంది. ఏటా 30 టీఎంసీల వరకు నీరు వృధా అవుతున్నట్టు అంచనా. నీటి వృధాను అరికట్టేందుకు కాలువలకు షటర్ల ఏర్పాటు తక్షణావసరంగా ఉంది.

దారి మళ్లిన నిధులు

సాగర్ కాలువల మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను ప్రభుత్వం దారి మళ్లించుకుంది. రైతులు ఏటా నీటి తీరువా చెల్లిస్తారు. నీటి శిస్తు ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలకు ఐదుశాతం కేటాయించగా 80 శాతం నిధులను మైనర్, మేజర్ ఇరిగేషన్‌లకు కేటాయించాలి. గతంలో సాగు నీటి సంఘాలు ఉండేవి. వీటికి ఎన్నికలు జరగకపోవడంతో సంబంధిత అధికారులకే నీటి సంఘాల బాధ్యతలను అప్పగించారు. ప్రాజెక్టు కమిటీ బాధ్యతలను ఎస్ఈకి, డిస్ట్రిబ్యూటరీ కమిటీల బాధ్యతలను ఈఈలకు, నీటి సంఘాల బాధ్యతలను డీఈ, జేఈలకు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆయా కమిటీల కాలువల నిర్వహణ పనులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాగా నీటి తీరువాకు సంబంధించిన నిధులను కూడా కమిటీల వారీగా కేటాయించాలి. వసూలైన నీటి తీరువాలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ నిధుల్లో సగం మేజర్, సగం మైనర్ ఇరిగేషన్‌లకు కేటాయించాలి. 10 శాతం పరిపాలనకు వినియోగిస్తారు. 15 శాతం నిధులను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం నిధులను ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇలా కేటాయింపులు ఐదేళ్లగా జరుగుతున్న దాఖలాలు లేవు. ఇలా వచ్చిన నిధులు కాడాకు చేరుతాయి. అక్కడి నుంచి నీటి సంఘాలకు దామాషా ప్రకారం కాడా నిధులు కేటాయించాలి. నిధులు చేరకపోవడంతో మరమ్మతుల నిర్వహణ విషయంలో కాడా కూడా చేతులెత్తేసింది. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా ఏటా రూ.30 కోట్ల నుంచి రూ.31 కోట్లు వస్తుందని అంచనా. రైతులు చెల్లించే నీటి తీరువాపై ఈ నిధులు ఆధారపడి ఉంటాయి. ఈ నిధులు కాడాకు చేరకుండా నేరుగా ప్రభుత్వం ఖజానాకు జమ అవుతున్నాయి. నీటి తీరువా నిధులు దారి మళ్లించడంతో కాలువల నిర్వహణకు నిధుల కొరత ఏర్పడింది. ఏటా నీటి తీరువా నిధులు మరమ్మతులకు విడుదల చేసి ఉంటే కాలువలు ఇంత అధ్వానంగా ఉండేవి కాదని రైతులు చెబుతున్నారు. గత ఐదేళ్లగా నీటి తీరువా నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధుల మాట ఎలా ఉన్నా తాము చెల్లించే నీటి తీరువా నిధులైనా కేటాయించి అత్యవసర మరమ్మతులైనా చేపట్టాలని ఏటా రైతులు కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదు. జూన్ నెలలో ఏర్పడే కొత్త ప్రభుత్వం అయినా కాలువలపై దృష్టి సారించి చివరి భూములకు నీరు అందిచేలా కాలువలకు మరమ్మతులు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.



అడవికాదు.. గోవిందాపురం మైనర్ కాలువ



అసాంఘిక శక్తులపై.. ఉక్కుపాదం

- శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠినంగా శిక్షిస్తాం
- ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా చర్యలు
- 144 సెక్షన్‌ను అమలు చేస్తాం
- నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మల్లికా గార్గ్

నరసరావుపేట లీగల్, మే 20: శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే సహించేది లేదు. ఇటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మల్లికా గార్గ్ స్పష్టం చేశారు. ఎస్పీగా మల్లికా గార్గ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోలింగ్, ఆ తర్వాత జరిగిన సంఘటనలను సమీక్షించి శాంతి భద్రతలను అదుపులోకి తీసుకురావడమే తన ప్రథమ బాధ్యత అన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రి యను సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల నేరాలకు సంబంధించిన నిందితులను గుర్తించి వారి అరెస్టులు త్వరితగతిన పూర్తి చేయనున్నట్టు పేర్కొన్నారు. 144 సెక్షన్‌ని పటిష్ఠంగా అమలు చేస్తాము. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

జిల్లా మూడవ ఎస్పీగా మల్లికా గార్గ్

జిల్లాకు మూడో ఎస్పీగా మల్లికా గార్గ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఇరువురు ఎస్పీలపై ఎన్నికల కమీషన్ చర్యలతో ఇక్కడి నుంచి వారు వెళ్లారు. చిలకలూరిపేట బొప్పూడి వద్ద జరిగిన ప్రధాని సభకు సంబంధించి భద్రతా వైఫల్యాల నేపథ్యంలో రవిశంకర్‌రెడ్డి బదిలీ చేశారు. పోలింగ్, అ తర్వాత జిల్లాలో జరిగిన హింసాత్మక సంఘటలను పురష్కరించుకొని బిందు మాధవ్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరగాలి

- జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

నరసరావుపేట కల్చరల్, మే, 20. ఈ నెల 24 వ తేది నుంచి జూన్ 1వ తేది వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగాలని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. సోమవారం ఇంటర్ పరీక్షల నిర్వహణపై పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న పల్నాడు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి ఎం.లీలావతి మాట్లాడుతు జరగబోయే పరీక్షలలో మొదటి సంవత్సరం జనరల్ ఒకేషనల్ విద్యార్థులు 10,157 మంది, రెండవ సంవత్సరానికి జనరల్ ఒకేషనల్ విద్యార్థులు 4,778 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మొత్తం 14,935 మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆమె చెప్పా రు. జిల్లా వ్యాప్తంగా 26 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఏవైనా సమస్యలు ఉన్నా, అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే కంట్రోల్ రూం నెంబర్ 08647- 223355 కు కాల్ చేయాలని ఆమె సూచించారు. సమీక్షా సమావేశంలో పలువురు విద్యాశాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నియామకం

- సస్పెన్షన్ అయిన వారి స్థానంలో కొత్త వారు
- జిల్లాలో పలువురికి పోస్టింగులు

నరసరావుపేట, మే 20: పోలింగ్ హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కొరడా ఝళిపించిన నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైన పోలీసు అధికారుల స్థానంలో కొత్తవారిని నియమిస్తూ ఎన్నికల కమీషన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నరసరావుపేట డీఎస్పీగా ఎం.సుధాకర్, గురజాల డీఎస్పీగా సీహెచ్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ-1గా బండారు సురేష్‌బాబు, సీఐ-2గా యు.శోభన్ బాబు, కారంపూడి ఎస్ఐగా కె.అమీర్, నాగార్జునసాగర్ ఎస్ఐగా ఎం.పట్టాభిని నియమిస్తూ ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిం ది. గురజాల డీఎస్పీ ఎ.పల్లపరాజు, నరసరావు పేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, డీఎస్పీ సీఐలు కే ప్రభాకర రావు, ఈ బాల నాగిరెడ్డి, కారంపూడి ఎస్ఐ ఎం.రాంజ నేయులు, నాగార్జున సాగర్ ఎస్ఐ డీవీ కొండా రెడ్డిలను ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.





పాలువాయిగేట్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ పి.వెంకటేశ్వరరావు, కంచరగుంటలో పోలీసుల సోదాలు

పల్లెల్లో.. జల్లెడ

- గ్రామాల్లో కార్డెన్ సెర్చ్
- అసాంఘిక శక్తుల ఏరివేతకే..

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, మే 20: పల్నాడులోని పలు గ్రామాల్లో సోమవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ళ గ్రామంలో పోలింగ్ అనంతరం జరిగిన హింసాత్మక సం ఘటనలు నేపథ్యంలో సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు ఆధ్వర్యంలో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేప ట్టారు. గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రూరల్ సీఐ, కేంద్ర పోలీసు బలగాలు, స్థానిక పోలీసులు పలు గృహాలను తనిఖీ చేశారు. ధ్రువ పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాజుపాలెం మండలం కొత్తబోధనం గ్రామంలో స్థానిక ఎస్ఐ షామీర్ బాషా ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు తనిఖీ చేశారు. పోలింగ్ రోజు జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని సోమ వారం గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామం లోని అనుమానితుల ఇళ్లలో క్షుణంగా తనిఖీ చేశారు. అదేవిధంగా అనుమానితులను విచారించటంతో పాటు వారికి చెందిన 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసు కొని రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వెల్దుర్తి మండలం పట్లవీడులో సోమవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ శివాజీరాజు, సీఐ సుబ్బారావు, వెల్దుర్తి ఎస్ఐ వెంకట్రావుతోపాటు 40 మంది పోలీసులు గ్రామంలో సోదాలు నిర్వహించారు. గృహాలు, శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న భవనాలు, వరిగడ్డి వాముల్లో తనిఖీ జరిపారు. పత్రాలు లేని 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గురజాల మండలం చర్లగుడిపాడులో సీఐ బాలకృష్ణ ఆధ్వర్యాన సోమవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. సుమారు 40 మంది పోలీసు బృందంతో సీఐ, ఇద్దరు ఎస్ఐలు కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు. సోదాల్లో ఎస్ఐలు సౌందర్‌రాజన్, అనంతకృష్ణ తదితరులు పాల్గొన్నారు. దుర్గి మండలం కంచరగుంటలో పోలీసులు సోమవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. 40 మంది పోలీసు బలగాలతో ఎస్ఐ కోటయ్య నేతృత్వంలో సోదాలు జరిపారు. డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నట్లు ఎస్ఐ కోటయ్య చెప్పారు. బెల్లంకొండ మండలంలో సమస్యాత్మక మైన గ్రామాల పై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం, మాచాయపాలెం, పాపాయపాలెం, మన్నె సుల్తాన్‌పాలెం గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు.

- శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన, దొంగతనాల నివారణ, అసాంఘిక శక్తుల ఏరివేతే కార్డన్ సెర్చ్ ముఖ్య ఉద్దేశమని ఇన్‌చార్జి డీఎస్పీ పి.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం రెంటచింతల మండలం పాలువాయిగేట్ గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి గ్రామస్థులతో సమావేశమై ఘర్షణ పడితే కుటుంబాలకు జరిగే నష్టాన్ని వివరించారు. ఈ నెల 13న పోలింగ్ సందర్భంగా ఘర్షణకు పాల్పడ్డ ఇద్దరిని అనుమానితులుగా గుర్తించామని, సరైన పత్రాలు లేని 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయన వెంట ఎస్ఐ ఎం.ఆంజనేయులు, స్పెషల్ పార్టీ పోలీసులున్నారు.

ఈవీఎంలను ధ్వంసం చేసిన 10 మంది అరెస్టు

పోలింగ్ సందర్భంగా విధులకు ఆటంకం కలిగించిన, ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్)లను ధ్వంసం చేసిన 10 మందిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ జీవీ రమణమూర్తి చెప్పారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుమ్మకోటకు చెందిన నలుగురు, జెట్టిపాలెంకు చెందిన ఆరుగుర్ని అరెస్టు చేశామన్నారు.



పట్లవీడులో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రశాంతతే.. ప్రధమం

- కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడమే ఛాలెంజ్
- జిల్లాకు చెడ్డ పేరు రాకుండా సహకరించాలి
- 450 మందిపై కేసులు నమోదు
- బైండోవర్ కేసులను పునఃపరిశీలన
- 144 సెక్షన్ అమలుపై సమీక్షించి నిర్ణయం
- ప్రత్యేక పరిస్థితుల్లో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించా
- కలెక్టర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీ



మాట్లాడుతున్న కలెక్టర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీ, జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట, మే20: జిల్లాలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులలో ఓట్ల లెక్కింపును సజావుగా, ప్రశాంతంగా నిర్వహించడమే తమ ముందు ఉన్న ఛాలెంజ్.. జిల్లాకు చెడ్డపేరు రాకుంగా ప్రశాంత కౌంటింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ పోలింగ్, తర్వాత హింస జరగడం చాలా తక్కువగా ఉంటుంది జిల్లాలో పోలింగ్, ఆ తర్వాత హింసాత్మక ఘటనలు ఎక్కువగా జరగడం వలన ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకొని నాకు ఇక్కడ పోస్టింగ్ ఇవ్వడం జరిగింది. ఎన్నికల ఓట్ల లెక్కింపును సజావుగా, ప్రశాంత వాతావరణలో పూర్తి చేయడం. కౌంటింగ్ తర్వాత కూడా ఎటువంటి అవాంఛనీయ ఘటలు జరగకుండా జిల్లా పరిపాలన విభాగం, పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు తీసుకుంటాం. జిల్లాలో అన్ని పోలింగ్ స్టేషన్‌ల్లో చక్కగా పోలింగ్ జరిగింది. కొన్ని చోట్ల ఘటనలు జరిగాయి. 27 ఘటనల వలన జిల్లాలో జరిగిన మంచి ఎన్నికల ప్రక్రియకు చెడ్డ పేరు వచ్చింది. ఇది చాలా దురదృష్టకరం. కౌంటింగ్ ప్రక్రియలో మన జిల్లాకు చెడ్డ పేరు కాకుండా అందరూ పని చేయాల్సి ఉంది. దేశ వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియలో జరిగిన హింసాత్మక ఘటనలతో చెడ్డ పేరు రావడానికి ఏ ఒక్కరూ కారణం కాదు. రాజకీయ పార్టీల శ్రేణులు, ప్రజలు కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. జిల్లాలో హింసాత్మక ఘటనలపై నమోదైన అన్ని కేసుల్లో త్వరితగతిన ఛార్జ్‌షీట్‌లు వేయాలని పోలీసు శాఖకు సూచించారు. ఈ 14 రోజులు కూడా ఏడు నియోజకవర్గాల వారీగా అల్లర్లకు పాల్పడే వ్యక్తులు, రౌడీ షీటర్లను గుర్తించి తగు చర్యలు తీసుకుంటాం. గతంలో నమోదు చేసిన బైండోవర్ కేసులను పునః పరిశీలిస్తాం. ఇంకా అవసరమైతే బైండోవర్ కేసులు కొత్తగా నమోదు చేస్తాం. గతంలో బైండోవర్ చేసిన వారు అల్లర్ల కేసుల్లో ఉన్నట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము. జరిగిన ఘటనలకు సంబంధించి 450 మందిపై కేసులు నమోదయ్యాయి అన్నారు.

196 కౌంటింగ్ టేబుల్స్..

పార్లమెంట్‌కు ఏడు, ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లకు ఏడు కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేస్తున్నాం. మొత్తం 196 కౌంటింగ్ టేబుల్స్ అవసరం ఉంటాయి. 700 మంది సిబ్బంది కౌంటింగ్‌కు అవసరం. వీరికి కౌంటింగ్ నిర్వహణపై శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. కౌంటింగ్ స్టాఫ్‌కు నియామక పత్రాలు రెండు మూడు రోజుల్లో జారీ చేస్తాం. 144 సెక్షన్ జిల్లాలో జూన్ 5 వరకు అమలులో ఉంటుంది. అందరి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని 144 సెక్షన్ ఎలా అమలు జరుగుతుంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారా అంశాలను పరిశీలిస్తాం. అవసరం లేని చోట్ల 144 సెక్షన్ సడలించే అంశంపై సబంధిత అధికారులతో సమీక్షిస్తాను. ప్రజలకు ఇబ్బందులు జరుగుతున్నా శాంతి భద్రతల కోసం తీసుకున్న చర్యలు కాబట్టి అందరూ సహకరించాలి. కౌంటింగ్ రోజు, ఆ తర్వాత బందోబస్తు ఎలా ఉండాలనే అంశంపై పోలీసు అధికారులతో సమీక్షించి నిర్ణయం తీసుకోవడం జరగుతుందన్నారు. గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేశాను. అప్పుడు కూడా ప్రత్యేక పరిస్థితుల్లోనే గుంటూరు నగర కమిషనర్‌గా 2018లో పనిచేశాను. గుంటూరులో డయేరియా ప్రబలడంతో తనను కమిషనర్‌గా నియమించారని చెప్పారు. ఇప్పుడు కూడా ఒక ప్రత్యేకమైన పరిస్థితుల్లో తనను కలెక్టర్ గా ఎన్నికల కమిషన్ నియమించడం జరిగిందని గుర్తు చేశారు. సమావేశంలో జేసీ శ్యాంప్రసాద్, డీఆర్‌వో వినాయకం పాల్గొన్నారు.

ఇండియా శ్రామిక మార్కెట్

(సోమవారం (20.5.24) దిక్సూచి తరువాయి)

ఉపాధి సంబంధిత సవాళ్లు

తక్కువ అవకాశాలు - ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో కనిపించని మార్పు: అధికంగా నమోదవుతున్న ఆర్థిక వృద్ధిరేటు అదే స్థాయిలో ఉపాధి అవకాశాలను సృష్టించడంలో విఫలమవుతున్నది. సేవలరంగం సహాయంతో మూలధన సాంద్రత పద్ధతిలో ఆర్థికవృద్ధి జరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఇందుకు విరుద్ధంగా అభివృద్ధి చెందిన దేశాలు పారిశ్రామికరంగం సహాయంతో అధిక వృద్ధిని సాధించాయి. ఇది లేకపోవడం వల్ల భారత ఆర్థికవ్యవస్థ నిర్మాణంలో చెప్పుకోదగ్గ మార్పు రావడంలేదు.

అసమానతల శ్రామిక మార్కెట్-సాంకేతిక సవాళ్లు: నూతన సాంకేతిక పరిజ్ఞానం శ్రామిక మార్కెట్‌లో అనేక మార్పులు తెచ్చింది. మూలధన సాంద్రత ప్రక్రియ రోజురోజుకూ పెరుగుతోంది. ఫలితంగా ఉద్యోగావకాశాల వృద్ధి తక్కువగా ఉంటున్నది. అధిక నైపుణ్యం అవసరమైన ఉద్యోగావకాశాలు పెరుగుతుండగా, తక్కువ నైపుణ్యం, నైపుణ్యం అవసరంలేని ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. ప్రాంతాలు, సామాజిక వర్గాలు, లింగపరమైన, వృత్తులపరంగా శ్రామిక మార్కెట్‌లో పెద్ద ఎత్తున అసమానతలు పెరుగుతున్నాయి.

ప్రాంతీయ అసమానతలు: ప్రత్యేకించి యువతకు ఉపాధి అవకాశాల సృష్టిలో దేశంలో ప్రాంతీయపరంగా తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయి. తూర్పు, మధ్య భారతదేశంలో గల రాష్ట్రాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. తక్కువ తలసరి ఆదాయాన్ని కలిగి ఉన్నాయి. ఉన్నత విద్య అభ్యసించిన యువత శాతం తక్కువగా ఉంది. సంఘటితరంగ ఉద్యోగిత తక్కువగా ఉంది. ఉద్యోగంలో, విద్యాలయాల్లో, శిక్షణలో గానీ లేని యువత శాతం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. ప్రాంతాల వారీగా ఉద్యోగితా విధానాలు రూపొందించాల్సిన అవసరాన్ని పై అసమానతలు సూచిస్తున్నాయి.

విద్య-నైపుణ్యం-ఉపాధి సవాళ్లు-సంక్షోభం: 2000-2022 మధ్యకాలంలో ఉన్నతవిద్య అభ్యసించిన వారిలో నిరుద్యోగ శాతం పెరిగింది. విద్యకు, ఉపాధికి అవసరమైన అధికస్థాయి నైపుణ్యానికి గల తేడాను ఈ పరిస్థితి చూపిస్తున్నది.

సాంకేతికతలో, పర్యావరణంలో మార్పులు: సాంకేతికరంగంలో వస్తున్న అనూహ్య మార్పులు శ్రామిక మార్కెట్‌కు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఉదాహరణకు సాంకేతికతలో వచ్చిన కృత్రిమ మేధ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) కొత్త ఉపాధి అవకాశాలతోపాటు అనేక సవాళ్లను శ్రామిక మార్కెట్ ముందు పెట్టింది. అంతేకాకుండా పర్యావరణంలో వస్తున్న మార్పులు అసంఘటితరంగ కార్మికుల జీవితాలను వ్యతిరేకంగా ప్రభావితం చేస్తున్నాయి. అయినప్పటికీ పర్యావరణ రక్షిత సుస్థిర వృద్ధి ప్రక్రియలో నూతన పర్యావరణ(గ్రీన్) ఉద్యోగాల సృష్టికి అవకాశాలు పెరుగుతున్నాయి. ఉదాహరణకు భారతదేశం 2030 నాటికి 500 గిగావాట్ల(జీడబ్ల్యూ) కాలుష్యరహిత విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. సౌరశక్తి, వాయుశక్తి లాంటి పునఃవినియోగిత ఇంధన సృష్టి ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నారు. ఈ ప్రక్రియలో 30,40,000(సత్వర, దీర్ఘకాలాల్లో) ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశం ఉంది. ఈవిధంగా సాంకేతికతలో, పర్యావరణంలో వస్తున్న మార్పులు సవాళ్లతోపాటు అవకాశాలను సృష్టిస్తున్నాయి.

యువత ఉపాధి సవాళ్లు: ఇండియాలో పనిచేయగల వయసు ఉన్నవారు 2011లో 59 శాతం ఉండగా 2021 నాటికి 63 శాతానికి పెరిగింది. రాబోయే 15 సంవత్సరాలు ఇదే పరిస్థితి స్థిరంగా ఉండనుంది. ఇండియా తన జనాభా నిధి(డెమోగ్రాఫిక్ డివిడెండ్)ని ఉపయోగించుకోవడంలో చివరిదశకు చేరింది. దేశం మొత్తం జనాభాలో యువత శాతం తగ్గడం ఆరంభమైనా అది ఇంకా 27 శాతం(దాదాపు 37 కోట్లు) ఉండటం, ఇతర దేశాలతో పోలిస్తే చాలా ఎక్కువనే చెప్పాలి.

యువ జనాభాలో తగ్గుతున్న శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి: యువ జనాభాలో 2000 సంవత్సరంలో శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి 54 శాతం ఉండగా 2022 నాటికి 44 శాతానికి తగ్గింది. యువత వయసు దశల ఆధారంగా(15-19, 20-24, 25-29) అది తీవ్రంగా తగ్గుతుండటం గమనార్హం. 2000, 2019 సంవత్సరాల మధ్య యువ కార్మికశక్తి, యువ జనాభా మధ్య నిష్పత్తి కూడా తగ్గిందని అంతర్జాతీయ కార్మిక సంస్థ వివరించింది.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ ఎకానమీ

యువతలోనే ఎక్కువ నిరుద్యోగం: ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ వయసు వారితో పోల్చితే మూడురెట్లు అధికంగా యువతలో నిరుద్యోగం ఉంది. ఇండియాలో కూడా ఇతర అధిక వయసు వారి కంటే యువతలో నిరుద్యోగం ఎక్కువగానే ఉంది. అంతేకాకుండా గత అనేక దశాబ్దాలుగా అది పెరుగుతూ ఉంది. ఇండియాలో యువతలో నిరుద్యోగం 2000 సంవత్సరంలో 5.6 శాతం ఉండగా, 2012లో 6.2 శాతం, 2018లో 18 శాతం, 2020లో 15.1 శాతంగా ఉంది.

చదువుకున్న యువతలో తీవ్ర నిరుద్యోగం: భారతీయ యువత ఉన్నతవిద్య అభ్యసిస్తున్నారు కానీ ఉద్యోగాల సృష్టి తగినంతగా జరగడం లేదని అంతర్జాతీయ కార్మికసంస్థ పేర్కొంది. నాలుగో తరగతి ఉద్యోగాల కోసం ఉన్నత విద్యావంతులు(పీహెచ్‌డీ, పీజీ, యూజీ కలిగినవారు) వేలు, లక్షలుగా దరఖాస్తు చేయడాన్ని ఇందుకు ఉదాహరణగా ఐఎల్‌ఓ పేర్కొంది. ఉత్తరప్రదేశ్ పోలీసుశాఖలో '62' ప్యూన్ ఉద్యోగాల కోసం 93 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 3,700 మంది డాక్టరేట్లు, 5,000 మంది గ్రాడ్యుయేట్స్, 28,000 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. ఉద్యోగానికి అవసరమైన విద్యార్హత కేవలం 'అయిదో తరగతి' కావడం గమనార్హం.

- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన మరో గ్రూప్-డి ఉద్యోగ పరీక్షకు 55 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ప్యూన్, వాచ్‌మన్, గార్డెనర్ లాంటి ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన వారిలో చాలామంది ఉన్నత విద్యావంతులు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో 15 ప్యూన్, డ్రైవర్, వాచ్‌మన్ ఉద్యోగాలకు 11వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసిన వారిలో డాక్టరేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్స్, గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. 2022లో బిహార్‌లో 15వేల రైల్వే ఉద్యోగాలకు లక్షల కొద్దీ నిరుద్యోగులు బిహార్, ఉత్తరప్రదేశ్ నుంచి దరఖాస్తు చేసుకున్నారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగ పరీక్ష ఫలితాల్లో అక్రమాలకు పాల్పడిందని 2023 జనవరిలో భారీఎత్తున నిరుద్యోగులు రోడ్ల మీద కొచ్చారు. అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చెప్పుకుంటున్న గుజరాత్‌లో 2022 జనవరిలో పదో తరగతి అర్హతతో 3,400 ఉద్యోగాలకు ప్రకటన ఇస్తే 1,70,00 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.
- చదువుకున్న యువతలో నిరుద్యోగం ఎంత తీవ్రంగా ఉందో పై సంఘటనలు సూచిస్తున్నాయని అంతర్జాతీయ కార్మికసంస్థ రూపొందించిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక-2024 పేర్కొంది.
- 2010-2019 మధ్యకాలంలో దక్షిణాసియాలోని యువతలో 29.2 శాతం ఉద్యోగాల్లో, విద్యాలయాల్లో, శిక్షణలో గానీ లేరని నివేదిక తెలిపింది. ఇండియా పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. ఇండియాలో మహిళల్లో ఈ పరిస్థితి పురుషుల కంటే ఎక్కువగా ఉంది.

శ్రామిక భాగస్వామ్య నిష్పత్తిలో లింగపరమైన అసమానత: గడిచిన రెండు దశాబ్దాలుగా శ్రామిక భాగస్వామ్య నిష్పత్తిలో తీవ్రమైన అసమానత అలాగే స్థిరంగా కొనసాగుతున్నది. 2022లో యువకుల్లో శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి 61.2 శాతం ఉండగా, యువతుల్లో కేవలం 21.7 శాతంగా ఉంది. గ్రామాలు, పట్టణాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. ఇది 'భారతీయ శ్రామిక మార్కెట్‌లో గల లింగపరమైన అసమానతలకు సూచిక'అని నివేదిక వ్యాఖ్యానించింది.

తక్కువ నాణ్యత గల ఉద్యోగాల్లో యువత: పెద్ద వయసు(30 సంవత్సరాలు, 30 సంవత్సరాల కంటే ఎక్కువ) వారితో పోలిస్తే యువత తక్కువ నాణ్యతతో కూడిన ఉద్యోగాల్లో ఎక్కువగా ఉన్నారు. యువత పారిశ్రామిక, సేవారంగాల్లో ఎక్కువగా ఉన్నప్పటికీ రోజువారీ ఉద్యోగాల్లో, ప్రతిఫలం చెల్లించని కుటుంబ సంబంధిత పరిశ్రమల్లో, తక్కువ ఆదాయంతో కూడిన స్వయంఉపాధిలో యువత ఎక్కువగా ఉన్నారు. తక్కువ వేతనం, తక్కువ ఆదాయం ఇచ్చే తక్కువ నైపుణ్యం అవసరమైన ఉపాధిలో లేదా అసలే నైపుణ్యం అవసరం లేని ఉపాధిలో యువత పెద్దవారి కంటే ఎక్కువగా ఉన్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ(ఐఎల్‌ఓ) న్యూఢిల్లీలోని మానవాభివృద్ధి సంస్థతో కలిసి తయారుచేసిన 2024 భారత ఉద్యోగస్థితి(ఇండియా ఎంప్లాయ్‌మెంట్) నివేదిక తెలిపింది.

- భారతదేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన నిరుద్యోగ సంక్షోభాన్ని ప్రత్యేకించి చదువుకున్న యువత నిరుద్యోగ స్థితిని ప్రాంతాల వారీగా, వివిధ సామాజిక వర్గాల వారీగా, లింగపరంగా, వృత్తులపరంగా భారత శ్రామిక మార్కెట్‌లో అసమానతలను పై నివేదిక తేటతెల్లం చేసింది. అధిక 'ఆర్థిక వృద్ధిరేటు, అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించడం సమస్యకు పరిష్కారం కాదు' అని కూడా నివేదిక సారాంశం. ప్రాంతాలు, వివిధ సామాజిక వర్గాలు, లింగపరంగా, వివిధ రంగాలవారీగా ప్రత్యేక ఉపాధి వ్యూహ విధానాల అవసరాన్ని నివేదిక నొక్కి చెప్పింది.

డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి,
హైదరాబాద్.



దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ- తెలంగాణ స్టేట్ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ సీపీజీఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. జేఎన్‌టీయూహెచ్, తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయం సహా కాకతీయ, ఉస్మానియా, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు యూనివర్సిటీల క్యాంపస్‌లు, గుర్తింపు పొందిన పీజీ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

తెలంగాణ కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంఏ స్పెషలైజేషన్‌లు: యాన్షియంట్ ఇండియన్ హిస్టరీ కల్చర్ అండ్ ఆర్కియాలజీ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, కన్నడ, మరాఠీ, పర్షియన్, సంస్కృతం, తెలుగు, ఉర్దూ, ఇస్లామిక్ స్టడీస్, లింగ్విస్టిక్స్, ఫిలాసఫీ, థియేటర్ ఆర్ట్స్, ఎకనామిక్స్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ.

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ టూరిజం మేనేజ్‌మెంట్.

ఎంకాం స్పెషలైజేషన్‌లు: జనరల్, ఐఎస్, ఈ కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇన్సూరెన్స్ అండ్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ అకౌంటింగ్.

- ఎంఈడీ, ఎంపీఈడీ

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: బోటనీ, కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫిజికల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, జాగ్రఫీ, జియో ఇన్ఫర్మాటిక్స్, జియాలజీ, అప్లయిడ్ జియో కెమిస్ట్రీ, మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథ్స్ విత్ కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, జియో ఫిజిక్స్, నానో సైన్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, స్టాటిస్టిక్స్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, జువాలజీ, ఫిషరీస్, బయోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫోరెన్సిక్ సైన్స్, జెనెటిక్స్, మైక్రోబయాలజీ, ఫర్మంటేషన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, ఫుడ్ సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సైకాలజీ, సెరికల్చర్, డేటా సైన్స్

పీజీ డిప్లొమా

స్పెషలైజేషన్: చైల్డ్ సైకాలజీ, ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లు

- ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ), ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్, ఐంటిగ్రేటెడ్ ఎంబీఏ

అర్హత వివరాలు: ఎంఏ, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, ఎంఎస్‌డబ్ల్యు, ఎంహెచ్ఆర్ఎం, ఎంటీఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ; ఎంఏ లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత లాంగ్వేజ్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. ఎంకాం కోర్సుల్లో ప్రవేశానికి బీకాం ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంఈడీలో ప్రవేశానికి బీఈడీ; ఎంపీఈడీలో ప్రవేశానికి బీపీఈడీ/ బీపీఈ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి.
- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత సబ్జెక్టులతో బీఏ/బీఎస్సీ/బీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) కోర్సుకు బీటెక్(ఫుడ్ సైన్స్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/ఫుడ్ అండ్ న్యూట్రిషన్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ జియోఇన్ఫర్మాటిక్స్‌కు బీఈ/ బీటెక్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీకి డిగ్రీ(అగ్రికల్చర్/వెటర్నరీ సైన్స్/ఫార్మసీ/ఫిషరీస్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. మిగిలిన స్పెషలైజేషన్‌లకు బీఎస్సీ(ఎంఎల్‌టీ/ నర్సింగ్/ అగ్రికల్చర్/ హోం సైన్స్)/ బీఫార్మసీ/ బీఈ/ బీటెక్ అభ్యర్థులు అనర్హులు.
- పీజీ డిప్లొమా(ఫోరెన్సిక్ సైన్స్/ఫార్మాస్యూటికల్ సైన్సెస్)లో ప్రవేశానికి బీఎస్సీ(బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్ స్పెషలైజేషన్‌కు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చైల్డ్ సైకాలజీ స్పెషలైజేషన్‌కు డిగ్రీ స్థాయిలో సైకాలజీ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివిన మహిళలు అప్లయ్ చేసుకోవచ్చు.
- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ)కి ఎంపీసీ/బైపీసీ/ఎంబైపీసీ గ్రూప్‌తో ఇంటర్/ పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్, ఐఎంబీఏలకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటర్‌లో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి.

సీపీజీఈటీ 2024 వివరాలు

- దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో సంబంధిత సబ్జెక్ట్ నుంచి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అనాలజీస్, క్లాసిఫికేషన్, మ్యాచింగ్, కాంప్రహెన్షన్ ఆఫ్ రీసెర్చ్ స్టడీ/ఎక్స్‌పరిమెంట్/థియరీ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ(బయోకెమిస్ట్రీ/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ఫోరెన్సిక్ సైన్స్/జెనెటిక్స్/మైక్రోబయాలజీ)కి నిర్వహించే ఎగ్జామ్‌లో కెమిస్ట్రీ నుంచి 40, ఫిజిక్స్/ బోటనీ/జువాలజీ/జెనెటిక్స్/మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ సబ్జెక్ట్ నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ బయోటెక్నాలజీకి నిర్వహించే ఎగ్జామ్‌లో కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు, బయోటెక్నాలజీ నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు.
- ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్యసమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **సీపీజీఈటీ 2024 తేదీలు:** జూలై 5 నుంచి
- **వెబ్‌సైట్:** cpget.tsche.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/EtCsnUxలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

పుట్టినరోజున కొత్త కబురు



మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్, ఫ్యాన్ బేస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దానిని దృష్టిలో ఉంచుకుని తన సినిమాల ఎంపిక ఎంతో కేర్ తీసుకుంటుంటారు ఎన్టీఆర్. ప్రస్తుతం అందరి దృష్టి ఆయన చేస్తున్న 'దేవర', 'వార్ 2' చిత్రాల మీదే ఉంది. తాజాగా ఇప్పుడు మరో భారీ చిత్రాన్ని ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రకటించారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాకు దర్శకుడు కావడం విశేషం. 'ఎన్టీఆర్ నీల్ అనే వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఎన్టీఆర్ స్టార్ పవర్, ప్రశాంత్ నీల్ విజనరీతో రూపుదిద్దుకొనే ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కేజీఎఫ్'కు దీటుగా భారీ స్కేల్‌లో ఉంటూ ఇండస్ట్రీలో సరికొత్త బెంచ్ మార్క్ క్రియేట్ చేస్తుందంటున్నారు నిర్మాతలు. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర', 'వార్ 2' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి చేసి ఆగస్టు నుంచి ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు.

పవర్‌ఫుల్ అవతార్‌లో...



మంచు మనోజ్ ఎనిమిదేళ్ల విరామం తర్వాత వెండితెరపైకి రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన ప్రతినాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తుండగా, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సోమవారం మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆయన పాత్ర గ్లింప్స్‌ను 'ద బ్లాక్ స్వార్డ్' పేరుతో విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో ఆయన చాలా పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ "మిరాయ్' కథ విన్నప్పుడు అద్భుతంగా అనిపించింది. ఈ సినిమా రెండు పార్టులుగా తెరకెక్కుతోంది. ఇంతటి చాలెంజింగ్ రోల్‌తో మళ్లీ ఇండస్ట్రీలో అడుగుపెట్టడం ఆనందంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ "ఈ సినిమాలో మనోజ్ భాగమవ్వటం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన కమ్‌బ్యాక్ ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని చెప్పారు. పీరియాడికల్ సూపర్ హీరో ఫాంటసీగా తెరకెక్కుతున్న 'మిరాయ్' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 18న ఎనిమిది భాషల్లో 2డి, 3డి వెర్షన్స్‌లో విడుదలవుతోంది.

పాత సినిమా.. కొత్త వివాదం



పాయల్ రాజ్‌పుత్ నాలుగేళ్ల క్రితం నటించిన 'రక్షణ' చిత్రం విషయంలో మొదలైన వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. తనకు ఇవ్వాల్సిన డబ్బు చెల్లిస్తేనే సినిమా ప్రమోషన్స్‌కు వస్తానని పాయల్, ఆమె ప్రమోషన్స్‌కు వచ్చిన తర్వాతే డబ్బు ఇస్తానని దర్శకనిర్మాత ప్రణదీప్ ఠాకూర్.. అంటూ మెట్టు దిగక పోవడంతో వివాదం మరింత జటిలమైంది. ఈ విషయంలో ప్రణదీప్ ఠాకూర్ మార్చి 28న తెలుగు నిర్మాతలమండలిని ఆశ్రయించారు. 'పాయల్ రాజ్‌పుత్ మా సినిమా కోసం 50 కాల్షీట్లు ఇచ్చింది. అందులో 47 రోజులు వర్క్ చేసింది. మిగిలిన ఆ మూడు రోజులు ప్రమోషన్స్ కోసం రమ్మని అడుగుతుంటే ఆమె సహకరించడం లేదు' అని ఆయన తెలుగునిర్మాతలమండలికి ఫిర్యాదు చేశారు. పాయల్ రాజ్‌పుత్‌కు ఇవ్వాల్సిన రూ. ఆరు లక్షలు ఇవ్వడానికి తను సిద్ధమేనని ఆయన వెల్లడించారు. నిర్మాత ఫిర్యాదును తెలుగు నిర్మాతలమండలి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు పంపించింది. అయితే ఆమె అందులో సభ్యురాలు కాకపోవడంతో తమ పరిధిలో లేని వ్యవహారమని 'మా' స్పష్టం చేయడంతో ఈ వ్యవహారాన్ని ముంబైలో ఉన్న ఫిల్మ్ ఫెడరేషన్‌కు దృష్టికి తీసుకెళ్లింది తెలుగు నిర్మాతలమండలి. ఈ లోగానే 'నాకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా 'రక్షణ' చిత్ర నిర్మాత వేధిస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి నన్ను బ్యాన్ చేయించడానికి ప్రయత్నిస్తున్నారు' అంటూ పాయల్ రాజ్‌పుత్ రెండు రోజుల క్రితం సోషల్ మీడియా ద్వారా ఆరోపించి, వివాదాన్ని సరికొత్త మలుపు తిప్పారు. దీనిపై తెలుగు నిర్మాతలమండలి స్పందిస్తూ పాయల్‌ను బ్యాన్ చేసే ఆలోచన తమకి లేదని ఏ సమస్యనైనా శాంతియుతంగా పరిష్కరించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేసింది. తెలుగు నిర్మాతలమండలి జోక్యంతో పాయల్ కొంత దారికి వచ్చిందని చెప్పాలి. ఆమె స్వరం కూడా మారింది. వివాదం పెద్దగా చేయడం ఎందుకని ఆమె అనుకున్నారో ఏమో ఈ విషయంపై వివరణ ఇస్తూ గంటల వ్యవధిలోనే మరో పోస్టింగ్ పెట్టారు. 'రక్షణ' సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో తెలుసు. ఈ సినిమాకు పనిచేసిన వారెవరికీ నష్టాలు రాకూడదనేది నా తాపత్రయం. 2020లో ఈ సినిమాకు ఎలా సపోర్ట్ చేశానో ఇప్పుడూ అంతే సహకారం అందిస్తాను. నా విన్నపం ఒకటే .. నాతో సంప్రదింపులు జరిపాకే ఈ సినిమా విషయంలో ఎటువంటి నిర్ణయమైనా తీసుకోండి. నేను ఎవరికీ హాని తలపెట్టాలని చూడటం లేదు. చిత్ర బృందం నుంచి పిలుపు కోసం.. ఈ సమస్యను పరిష్కరించడానికి నా టీమ్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తోంది" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.



ఆటోతో టుక్ టుక్



చిత్ర వాహినీ, ఆర్‌వైజీ సంస్థలు నిర్మిస్తున్న 'టుక్ టుక్' పోస్టర్‌ను విడుదల చేశారు. విచిత్రమైన ఆటోతో ఈ పోస్టర్ ఆకర్షణీయంగా ఉంది. సుప్రీత్ సి.కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హీరోలు హర్షరోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు ఓ ఆటో బొమ్మను ఆసక్తికరంగా చూస్తున్నారు. అసలు ఆ ఆటో బొమ్మ ఏమిటి, దానికీ, చిత్రకథకు ఉన్న సంబంధం ఏమిటి అనే అంశాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. సోషియో ఫాంటసీ ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రాన్ని రాహుల్ రెడ్డి, లోక్కు. సాయివరుణ్, శ్రీరాములు రెడ్డి నిర్మించారు. ఈ సినిమాకు సంగీతం: సంతు ఓంకార్, ఫొటోగ్రఫీ: హార్దిక్ శ్రీకుమార్.

దీవిలో తుపాన్



ఇటీవల విడుదలైన 'లవ్‌గురు' చిత్రంతో విజయాన్ని అందుకొన్న తమిళ హీరో విజయ్ ఆంటోనీ తాజా చిత్రం 'తుపాన్'. విజయ్ ఆంటోనీతో ఇంతకుముందు 'రాఘవన్', 'హత్య' చిత్రాలను నిర్మించిన కమల్ బరా, డి.లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా ఈ సినిమాకు నిర్మాతలు. పోయెటిక్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా దీనిని దర్శకుడు విజయ్ మిల్లర్ రూపొందిస్తున్నారు. 'ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉంది. ఓ దీవి నేపథ్యంగా సాగే ఈ సినిమా షూటింగ్ అండమాన్, డయ్యూ డామన్‌లో జరిపాం. ఈ నెల 29న టీజర్ విడుదల చేసి, త్వరలోనే చిత్రాన్ని రిలీజ్ చేస్తాం' అని నిర్మాతలు చెప్పారు.

ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా

రచయిత విజయేంద్ర ప్రసాద్



'బేబి'తో సూపర్ హిట్ కొట్టిన తర్వాత ఆనంద్ దేవరకొండ నటించిన చిత్రం 'గం గం గణేశా'. ఈ యాక్షన్ ఎంటర్టైనర్‌కు ఉదయ్ శెట్టి దర్శకత్వం వహించారు. కేదార్ శెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించారు. మే 31న ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. సోమవారం ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. సినిమా దర్శకుడు ఉదయ్ శెట్టి మాట్లాడుతూ "వినాయక చవితి చుట్టూ తిరిగే కథతో ఈ సినిమాని రూపొందించాం. వినోదంతో పాటు ఇందులోని ట్విస్టులు, థ్రిల్‌లు ఆకట్టుకుంటాయి" అని అన్నారు. "నేను ఇప్పటిదాకా రియలిస్టిక్ పాత్రలు పోషించాను. ఈ సినిమాలో నా పాత్ర ఫుల్ ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఇది టిపికల్ క్రైమ్ కామెడీ జానర్" అని ఆనంద్ దేవరకొండ అన్నారు. ఈ చిత్రంలో ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిశోర్, జబర్దస్త్ ఇమ్మాన్యుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాది, సంగీతం: చేతన్ భరద్వాజ్, సహ నిర్మాత: అనురాగ్ పర్వతనేని.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XKJOAG0 లో చదవండి.

ప్రభుత్వ స్థలం.. కబ్జాకు యత్నం

● విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్నే కాజేసిన ఘనులు

● న్యాయం చేయాలంటూ విద్యుత్ అధికారుల విన్నపం

దాచేపల్లి, మే20: దాచేపల్లిలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువైంది. ప్రభుత్వ స్థలాలకు కూడా డీకే పట్టాలు పుట్టించి మావేనంటూ ఆక్రమించుకోవాలని చూడటంతో అధికారులు న్యాయం చేయాలంటూ న్యాయస్థానాన్ని, రెవెన్యూ అధికారులను కోరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాచేపల్లి విద్యుత్‌శాఖ ఏడీఈ వీరేశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. సుమారు 60 సంవత్సరాల క్రితం నడికూడి గ్రామ శివారులోని 33/11 కెవి నడికూడి సబ్‌స్టేషన్‌కు స్థలం ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ స్థలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి ప్రజలకు సేవలు అందిస్తున్నారు. కాగా దాచేపల్లికి చెందిన కొందరు వ్యక్తులు ఆ స్థలానికి డీకే పట్టా పుట్టించి మాదేనంటూ స్థలంలోకి ప్రవేశించి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేశామని తెలిపారు. పట్టా పుట్టించిన వ్యక్తులు డిపార్ట్‌మెంట్ వారి సామాగ్రిని విసిరివేయడం, అక్కడున్న సిబ్బందిపై దౌర్జన్యం చేయడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకోవడం పరిపాటిగా మారిందని అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థలంపై దాచేపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న గీతావాణి డీకే పట్టా పొందిన గరికపాటి భానురేఖ భర్త విశ్వనాథంకు ఎటువంటి సంబంధం లేదని లిఖితపూర్వకంగా వివరించారు. ఈ స్థలంపై పూర్తిగా విద్యుత్‌శాఖ పరిధిలోనే వుందని, ఈ విషయంపై ఎటువంటి అనుమానాలకు తావులేదని ఆమె స్పష్టం చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ చుట్టూ వేసిన ఫెన్సింగ్ సదరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోనే వుందని తహసీల్దార్ గీతావాణి స్పష్టం చేశారు. అయినప్పటికీ పట్టా పొందిన వ్యక్తులు మాత్రం తమ ఆగడాలు మాత్రం ఆపడం లేదని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి ఆక్రమణదారుల నుంచి స్థలాలను కాపాడాల్సిందిగా కోరుతున్నారు.



వెంకటపాలెం శిబిరంలో నిరసన తెలుపుతున్న మహిళలు

అమరావతి అభివృద్ధితో రాష్ట్ర ప్రగతి సాధ్యం

● 1616వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మే 20: అమరావతి అభివృద్ధితో రాష్ట్ర ప్రగతి సాధ్యమని రాజధానికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు సోమవారం నాటికి 1616వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. సీఎం జగన్‌రెడ్డి ఆడిన మూడు రాజధానుల ఆటలో వ్యవస్థలంతా అస్తవ్యస్తం అయ్యాయని పేర్కొన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం కాకుండా రాజకీయ లబ్ధికోసం మూడు ముక్కలాటను జగన్‌రెడ్డి ఆడుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో వైసీపీ ఇంటికి పోవటం ఖాయమని స్పష్టం చేశారు. రాష్ట్ర నడిబొడ్డులో ఉన్న అమరావతిని ప్రజలు కోరుకుంటుంటే వారి అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా మూడు రాజధానులని ఆంధ్రప్రదేశ్‌కి విలువ లేకుండా చేశాడన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు.

70 శాతం రైళ్లు రద్దు



● డజన్ల కొద్దీ రైళ్లు రద్దుతో ప్రయాణికులకు ఇక్కట్లు

● సింహాద్రి, గోల్కొండ సహా పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్ల రద్దు

● వేసవి సెలవులు, ఎన్నికల సమయంలోనూ పునరుద్ధరణ కరువు

● మూడు నాలుగు నెలలకు పైగా సింహాద్రి, గోల్కొండ

● ఆధునికీకరణ కోసమా? లేక ఆదాయం కోసమా?

● గూడ్స్‌రైళ్ల కోసమేనంటూ విమర్శల వెల్లువ

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతికి ఇరువైపులా వున్న రెండు నగరాల మధ్య రైలు రాకపోకలు దారుణంగా పడిపోయాయి. కేవలం 30 కిలోమీటర్ల దూరంలో వున్న విజయవాడ, గుంటూరుల మధ్య ఉదయం 10 దాటిన తరువాత, సాయంత్రం 5 గంటలలోపు రైలు ప్రయాణ సదుపాయం లేదంటే నమ్ముతారా? నమ్మక పోయినా అదే నిజం! ఈ రెండు నగరాల మధ్య సికింద్రాబాద్- గుంటూరు మధ్య నడిచే సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌తో సహా అన్ని రైళ్లు అన్నీ రద్దయిపోయాయి. దాదాపు నెలల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రోజు రోజుకు రద్దయ్యే రైళ్ల సంఖ్య పెరగడమే తప్ప తగ్గడం కనిపించడంలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైల్వేలో రద్దుల పర్వం

కొవిడ్ మహమ్మారి రాకకు ముందు సామాన్య, పేద ప్రయాణికులకు సేవలు అందించిన రైల్వే ఆ తరువాత క్రమంగా దూరమవుతూ వస్తోంది. కొవిడ్ సందర్భంగా కేంద్ర ప్రకటించిన లాక్‌డౌన్‌తో దాదాపు 2 నెలలు ఆగిపోయిన రైళ్లు అనంతరకాలంలో కూడా సామాన్యులకు అందుబాటులోకి రాలేదు. లాక్‌డౌన్ పూర్తై మూడేళ్లు పూర్తయినా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ పూర్తిస్థాయిలో ప్రయాణికుల రైళ్లను పునరుద్ధరించలేదు. స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో నడుపుతున్న రైళ్లలో ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేస్తుండడంతో సామాన్య, పేద ప్రజలపై భారం రెండు, మూడు రెట్లు పెరిగింది. ఎన్నికలకు నెల రోజుల ముందు వరకూ స్పెషల్ చార్జీలు వసూలు చేసిన రైల్వేశాఖ ఎన్నికల కారణంగా పాసింజర్ రైళ్లపై వేసిన స్పెషల్ చార్జీలను పాతరేట్లకు తగ్గించింది. కానీ టిక్కెట్ రేట్లు తగ్గాయన్న ఆనందం ప్రజలకు మిగలలేదు. ఎందుకంటే దాదాపు 70 శాతం రైళ్లు రద్దయ్యాయి.

నెలల తరబడి డజన్ల కొద్దీ రైళ్ల రద్దు

గడిచిన ఆరు, ఏడు నెలలుగా విజయవాడ డివిజన్లో రైళ్లు విపరీతంగా రద్దవుతున్నాయి. మెయింటెనెన్స్ పేరుతో నెలల తరబడి రైళ్లు ఆపేస్తున్నారు. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే సింహాద్రి, గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లు జిల్లా ప్రజలకు అందుబాటులో లేకుండాపోయాయి. గడిచిన నాలుగు నెలల్లో పట్టుమని పది రోజులు కూడా ఈ రైళ్లు నడవలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గడిచిన కొన్ని నెలలుగా సింహాద్రి,గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేయడంతో గుంటూరు నుంచి ప్రధాన నగరాలైన సికింద్రాబాద్, విశాఖపట్నం, రాజమండ్రి, అన్నవరం, వరంగల్ వెళ్లే ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు తాజాగా విజయవాడ మీదుగా వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను కూడా తాజాగా రద్దవడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. విజయవాడ- గుంటూరు- తెనాలి- విజయవాడ సర్కిలర్ ట్రైన్లు దాదాపు రెండు నెలలుగా కనిపించడం లేదు. విజయవాడ నుంచి నరసాపురం, మచిలీపట్నం వెళ్లే రైళ్లు కూడా రద్దయ్యాయి. గుంటూరు నుంచి మాచర్ల, హుబ్లీ వెళ్లే రైళ్లు కూడా రద్దవడంతో పల్నాడు జిల్లా సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం వైపు వెళ్లే ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. తెనాలి మీదగా వెళ్లే పలు రైళ్లు రద్దయ్యాయి. కృష్ణా ఎక్స్‌ప్రెస్ దారి మళ్లించారు. తిరుపతి ఎక్స్‌ప్రెస్, బిట్రగుంట పాసింజర్ రద్దు చేశారు. గ్రామీణ ప్రజలు ఆధారపడే పాసింజర్ రైళ్లు దాదాపుగా రద్దయ్యాయి. విజయవాడ గూడురు, విజయవాడ ఒంగోలు రైళ్లు రద్దవడంతో బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడురు వెళ్లే ప్రయాణికులకు బస్సులే దిక్కయ్యాయి.

మోయలేని బస్సుల భారం

రైళ్లు రద్దవడంతో బస్సుల్లో వెళదామంటే బస్సు చార్జీల పేరు వింటే ప్రయాణికుల గుండెలు గుబేలు మంటున్నాయి. ప్రయాణికులపై దయలేని రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగేళ్లలో మూడుసార్లు బస్ చార్జీలు పెంచింది. దీంతో బస్ చార్జీలు భారం మూడు, నాలుగు రెట్లు పెరిగింది. రైలులో 30, 40 రూపాయలతో గమ్యస్థానం చేరేవారు బస్సులో వెళ్లాలంటే 200 నుంచి 300 రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో చాలామంది సామాన్యులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. పిల్లలకు వేసవి సెలవులు రావడం, సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడానికి సొంత ఊర్లకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తడంతో ప్రయాణాలు కూడా వాయిదా వేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వందల రూపాయలు ధారబోసి బస్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తోంది.

రైల్వే అధికారులు రైలు పట్టాల మరమ్మతు, రూటు ఆధునికీకరణ పేరుతో రైళ్లు రద్దు చేస్తూ పోతున్నారు. వారమో, పది రోజులో మరమ్మతు పనులు వుండడం సహజం అనుకుని సర్దుకుపోతున్నా నెలలు తరబడి రద్దుల పర్వం కొనసాగుతోంది. గడిచిన ఆరు నెలలుగా వారం పదిరోజులకు మించి పలు రైళ్లు పట్టాలు కూడా ఎక్కని పరిస్థితి కనిపిస్తోంది. మరో వైపు సరుకు రవాణా వాహనాల జోరు కొనసాగుతూనే ఉంది. సరుకు రవాణా వాహనాల ద్వారా ఆదాయం వచ్చే అవకాశం వుండడం వల్ల రైల్వే శాఖ ఆ దిశగా ఆలోచిస్తోందని, లాభదాయకం కాని ప్రజా రవాణాను కావాలనే నిర్లక్ష్యం చేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన గుంటూరు, విజయవాడల మధ్యనే రైలు ప్రయాణాలు కరువవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం రైల్వే అధికారులతో మాట్లాడడంగానీ, ప్రయాణికుల సదుపాయార్థం చర్యలకై ఒత్తిడి తేవడం కానీ చేయకపోవడం పట్ల ప్రయాణికుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అల్లర్లపై.. ఆరా

● పల్నాడు జిల్లాలో ఘటనలపై 22 కేసులు నమోదు

● 581 మందిని నిందితుల గుర్తింపు

● కొనసాగుతున్న సిట్ దర్యాప్తు


నరసరావుపేటలో హింసాత్మక సంఘటన జరిగిన మునిసిపల్ హైస్కూల్ ఏరియాను పరిశీలిస్తున్న సిట్ ఎస్పీ సౌమ్యలత

నరసరావుపేట, మే 20: పోలింగ్, ఆ తర్వాత జిల్లాలో చెలరేగిన హింసాత్మక ఘటనలపై 22 కేసులు నమోదయ్యాయని సిట్ ప్రకటించింది. నరసరావుపేటలో సోమవారం కూడా సిట్ విచారణ కొనసాగింది. రెండవ పట్టణ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఐదు కేసులపై సిట్ అధికారిణి సౌమ్యలత వివరాలు సేకరించారు. పట్టణంలో హింసాత్మక ఘటలను జరిగిన ప్రదేశాలను ఆమె పరిశీలించారు. మునిసిపల్ ఉన్నత పాఠశాల, గుంటూరు రోడ్డులలో జరిగిన అల్లర్లపై ఆరా తీశారు. జిల్లాలో జరిగిన అరాచకాలపై ప్రాథమిక నివేదికను డీజీపీకి అందజేశారు. మూడు రోజులుగా జిల్లాలో సిట్ అధికారులు జరిపిన విచారణకు సంబంధించిన వివరాలను నివేదికలో పొందుపరిచారు. జిల్లాల్లో నమోదైన 22 కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను సిట్ బృందం పరిశీలించింది. ఈ కేసుల్లో మొత్తం 581 మందిని ముద్దాయిలుగా పేర్కొన్నారు. వీరిలో 274 మందిని గుర్తించారు. 307 మందిని గుర్తించాల్సి ఉందని సిట్ తెలిపింది. ఇప్పటివరకు 19 మందిని అరెస్టు చేవారు. 91 మందికి 41 నోటీసులు ఇచ్చారు. హింసాత్మక ఘటనలకు పాల్పడిన ఇంకా 471 మందిని అరెస్టు చేయాలని నిదికలో పేర్కొన్నారు. నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

క్షేత్ర స్థాయిలో హింస జరిగిన ప్రదేశాలను సిట్ బృందం స్వయంగా పరిశీలించింది. పోలీసులు, ఇతర వర్గాల నుంచి సాక్ష్యాలను సేకరించింది. కేసుల దర్యాప్తులో లోపాలు ఉన్నట్టు సిట్ గుర్తించింది. నమోదైన ఎఫ్ఐఆర్‌లో కొత్త సెక్షన్లు చేర్చే అంశంపైనా సిట్ సదరు అధికారులను ఆదేశిస్తోంది. దీంతో సదరు అధికారులు కంగుతింటున్నారు. హింస జరుగుతుందని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోవడంలో కొందరు పోలీసు అధికారులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యంతగా వ్యవహరించినట్టు సిట్ గుర్తించింది. కొందరు రాజకీయ పార్టీల నేతలతో పోలీసులు కుమ్మక్కై దాడులు జరుగుతున్నా చూసీచూడనట్టు వ్యవహరించారని సిట్ నిర్ధారించినట్టు తెలిసింది. హింసాత్మక సంఘటనలకు వినియోగించిన పెట్రోలు బాంబులు, కర్రలు, రాళ్లు, ఇనుపరాడ్లు వంటి సామాగ్రికి సంబంధదించిన ఆధారాలను కూడా సిట్ అధికారులు సేకరించారు. ఈ నేపథ్యంలో కొందరు రాజకీయ నేతలను కూడా అరెస్టు చేసే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

నరసరావుపేట పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లలో సిట్ అధికారిణి సౌమ్యలత మూడు రోజులుగా విచారిస్తున్నారు. సోమవారం రాత్రి కూడా రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కారంపూడి, దాచేపల్లి, రెంటచింత పోలీసు స్టేషన్‌లకు సిట్ వెళ్లి హింస ఘటలనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించింది. జిల్లాలో మిగతా చోట్ల జరిగిన ఘటనలపై కూడా విచారించేందుకు సిట్ సిద్ధమవుతోంది. మాచర్ల, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాల్లో జరిగిన ఘటనలకు సంబంధించి ప్రాథమిక విచారణ నివేదికను డీజీపీకి సమర్పించింది. మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి, మాచర్ల రూరల్, పట్టణం, సత్తెనపల్లి, పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాల్లో జరిగిన హింసపై కూడా సిట్ విచారించాల్సి ఉంది. పర్యవేక్షణలో భాగంగా జిల్లా స్థాయిలో నిందితులను గుర్తించి వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఉన్న సెక్షన్‌లకు తగిన చట్టంలోని సెక్షన్‌లను జోడించడం కోసం సంబంధిత కోర్టుల్లో మెమో దాఖలు చేయాలని దర్యాప్తు అధికారులకు సిట్ సూచించింది. సీసీ ఫుటేజీలు, వీడియోలు డిజిటల్ సాక్ష్యాలను సేకరించాలని, నిందితులను అరెస్టు చేయడంతో పాటు చార్జ్ షీట్ దాఖలు చేయాలని సిట్ ఆదేశించింది. సిట్ విచారణ ముమ్మరంగా సాగుతుండటంతో అధికార పార్టీ నేతలతో అంటకాగిన అధికారుల్లో గుబులురేపుతోంది.

డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, మే 20: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 10వ తేదీ వరకు నిర్వహించిన డిగ్రీ కోర్సుల 6వ సెమిస్టర్ ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఏ ఓఎల్ కోర్సుల ఫలితాలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్‌రావు మాట్లాడుతూ 23,450 మంది హాజరవగా 23,240 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

వర్సిటీ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ దరఖాస్తు గడువు పొడిగింపు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ గడువు తేదీని పొడిగించినట్లు సోమవారం అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ అనిత తెలిపారు. అరు లైన అభ్యర్థులు జూన్ 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఈ కోర్సులను అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ టెస్ట్ ద్వారా బీటెక్ ప్లస్ ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ఇంజనీరింగ్ విద్యను వర్శిటీ అందిస్తుందని పేర్కొన్నారు. సీఎస్ఈ, ఈసీఈ, ఎంఈ, సీఈ, ఈఈఈ, ఈసీఈ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్, మెషిన్ లెర్నింగ్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తామని డాక్టర్ అనిత తెలిపారు.

కిడ్నాప్ కేసులో నలుగురు అరెస్టు

చిలకలూరిపేట, మే 20: ఒక స్థల వివాదం కేసులో వ్యక్తి కిడ్నాప్ ఘటనకు సంబంధించి నలుగురు వ్యక్తులను అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కొత్త రాజాపేటలో మూడు సెంట్ల స్థలానికి సంబంధించి ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం ఉంది. చిలకలూరిపేట మండలం పోతవరం గ్రామానికి చెందిన కార్పెంటర్ ఉయ్యాల శివనాగరాజు ఈ వివాదానికి సంబంధించి తనను కిడ్నాప్ చేశారంటూ అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లింగంగుంట్ల గ్రామానికి చెందిన మొగిలి శ్రీను, మరో ఆరుగురు కలసి తన కాళ్ళు, చేతులు తాళ్ళతో కట్టి వేసి కిడ్నాప్‌కు పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్నొన్నారు. శివ నాగరాజు తప్పించుకొని పారిపోయి వచ్చి తగు న్యాయం చేయాలని అర్బన్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో అర్బన్ ఎస్ఐ సుమన్ దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం మొగిలి శ్రీనుతో పాటు మరో ముగ్గురిని ఈ కేసులో అరెస్టు చేశారు. మరి కొందరిని అరెస్టు చేయాల్సి ఉంది.

1281 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మే 20: స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన వేలంలో 1281 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 10,800 గరిష్ఠధర రూ. 14,200 మోడల్‌ధర రూ.13,600 పలికాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 10,800 గరిష్ఠధర రూ. 13,825, మోడల్‌ధర రూ.13,600 పలికాయి.

అన్నా... నీకే ఓటేశా!

● ఏ నాయకుడు ఎదురైనా ఓటరు ఇదే సమాధానం

● ఓటు రహస్యాన్ని బయటపెట్టకుండా జాగ్రత్త

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలో తన ఓటుని తనకు ఇష్టమైన పార్టీకి వేసి నిక్షిప్తం చేసిన ఓటరు పోలింగ్ ముగిసిన తర్వాత ఎంతో తెలివితనాన్ని ప్రదర్శిస్తున్నాడు. స్థానిక రాజకీయ పార్టీల నాయకులు ఎవరైనా ఎదురుపడి ఏ పార్టీకి ఓటు వేశావని అడిగితే అన్నా... మన పార్టీకి వేయక ఇంకెవరికి వేస్తానంటూ సమాధానం ఇస్తున్నాడు. తద్వారా ఆయా పార్టీల నేతల్లో గెలుపు ఆశలను పెంచుతున్నాడు. చాలామంది ఓటర్లు ఇరు పార్టీల నాయకులు పంచిన నగదుని తీసుకొని తమకు ఇష్టమైన పార్టీకే ఓటు వేశారు. దీని వలన డబ్బు ప్రభావం అనేది ఈ ఎన్నికల ఫలితాలపై పెద్దగా ప్రభావం చూపించదు. ఓటరు చెబుతున్న సమాధానంతో ఎవరికి వారు తమదే గెలుపు అని అంచనాలు వేసుకొంటున్నారు. అయితే ఓటర్లు ఎక్కువగా ఏ పార్టీకి జై కొట్టారనేది జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుతో తేలిపోతుంది.

జిల్లాలో ఈ దఫా ఎన్నికలు చాలా కాస్ట్‌లీగా జరిగాయి. జనవరి నెల నుంచే ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తూ అన్ని పార్టీల నేతలు ఇంటింటి ప్రచారాలను నిర్వహించారు. ధూంధాంగా డీజే సౌండ్ సెట్లతో వాతావరణాన్ని వేడెక్కించారు. అధికార వైసీపీ నేతల చేతుల్లో డబ్బులు ఉండటంతో అప్పటి నుంచే వార్డుల్లో మీటింగ్‌లు పెట్టడం, భోజనాలు ఏర్పాటు చేయడం వంటివి నిర్వహించారు. మరోవైపు టీడీపీ అభ్యర్థులు డోర్-టూ-డోర్ వెళ్లి ఓటర్లను కలుసుకొని చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6ని ప్రజల్లోకి తీసుకెళ్లి వారి ఆదరాభిమానాలు పొందడంపై దృష్టి పెట్టారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రచారాలకు కూడా అన్ని పార్టీలు బాగానే ఖర్చు చేశాయి.

పోలింగ్‌కి రెండు, మూడు రోజుల ముందుగా ఓటర్లకు డబ్బు పంపిణీకి తెర లేపాయి. నియోజకవర్గాన్ని బట్టి రూ. వెయ్యి నుంచి రూ.3,500 వరకు పంచారు. ఈ క్రమంలో కొంతమంది చోటామోటా నాయకులు ఓటర్లకు డబ్బు పంచకుండా నొక్కేసి పంచామని నేతలకు చెప్పుకొన్నారు. వైసీపీలో ఇలా ఎక్కువగా జరిగింది. అభ్యర్థులు ఇంచుమించు సరిసమానంగానే నగదుని ఓటర్లకు పంచారు. దీని వలన ఓటరు డబ్బు తీసుకొన్నాడు కాబట్టి ఒక పార్టీ వైపు మొగ్గు చూపుతారన్నది నిజం కాదని తేలింది. ఇరు పార్టీల వద్ద డబ్బు తీసుకొన్న ఓటర్లు పోలింగ్ రోజున తెల్లవారజామునే బూత్‌ల వద్దకు వెళ్లి క్యూలైన్లలో నిలుచుని ఓటేసి వచ్చేశారు. పోలింగ్ బూత్‌లోకి వెళ్లే ముందు కూడా రెండు పార్టీల అభ్యర్థులు తమకే ఓటు వేయాలని అభ్యర్థించగా ఓటరు చిరునవ్వుతో మీకేనన్నట్లు సమాధానం ఇచ్చారు. బయటకు వచ్చేటప్పుడు కూడా ఎక్కడా తన ఓటు గోప్యతని బయట పెట్టలేదు. ఎవరడిగినా మీకేనన్నట్లుగా సమాధానం చెప్పారు. దానిని నేటికీ అలానే కొనసాగిస్తున్నారు. దీంతో బెట్టింగులపై ఎవరూ ధీమాగా లేరు. కూటమి తరుపున చాలామంది రూ.లక్షకు రూ.లక్షన్నర ఇస్తామని బెట్టింగ్‌కు ప్రతిపాదిస్తున్నా వైసీపీ తరపున ఎవరూ ముందుకు రాని పరిస్థితి కొనసాగుతోంది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చేతికి సంకెళ్లా?

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): హంతకులు, బందిపోట్లకు వేసినట్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చేతులకు సంకెళ్లు వేయడమేంటని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు పోలీసులను నిలదీశారు. పల్నాడు జిల్లా మాచవరం ఎంపీపీ కుమారుడిపై జరిగిన దాడి కేసును అడ్డంపెట్టుకుని, సంబంధంలేని టీడీపీ కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు వారిని మూడు రోజులపాటు తీవ్రంగా కొట్టి హింసించి, వారిపై హత్యాయత్నం కేసు నమోదుచేసి సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. గాయాలను పరిశీలించిన న్యాయమూర్తి వారివద్ద వాంగ్మూలం తీసుకొని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి పంపించారు. గుంటూరు సబ్ జైల్లో ఉన్న నిఖిల్, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రైతు మోహన్ రావుని ఆసుపత్రికి తీసుకు వెళ్లే సమయంలో వారి చేతులకు పోలీసులు బేడీలు వేసేందుకు ప్రయత్నించారు. దాన్ని గమనించిన టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు బేడీలు వేయడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వారేమైనా బందిపోట్లా, నక్సలైట్లా అంటూ పోలీసులను నిలదీశారు. అయినా వెనక్కు తగ్గని పోలీసులు బేడీలు వేసి తీరాల్సిందేనని పట్టుబట్టారు. కనపర్తి కూడా అదేస్థాయిలో తీవ్రంగా ప్రతిఘటించటంతో పోలీసులు వెనక్కు తగ్గి బేడీలు వేయకుండానే ఆటోలో వారిరువురినీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు.


బేడీలు వేస్తున్న పోలీసులను అడ్డుకుంటున్న కనపర్తి, టీడీపీ నేతలు

దేవుడి మాన్యం భూమి.. కబ్జాకు యత్నం

● రాత్రికి రాత్రి భూమిలో సిమెంటు పిల్లర్లు ఏర్పాటు ● పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు


దేవుడి మాన్యం భూమిలో సిమెంటు పిల్లర్లు వేసిన దృశ్యం

తాడికొండ, మే20: తాడికొండ అడ్డరోడ్డు నుంచి తాడికొండకు వచ్చే ప్రధాన రహదారిలోని గొడుగు కంపెనీ ఎదురుగా ఉన్న దేవుడి మాన్యం భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. అదే తడవుగా భూమిని చదును చేయటమే కాకుండా ఏకంగా సిమెంటు పిల్లర్లు వేశారు. కోట్ల రూపాయాలు విలువచేసే భూమిని దోచుకోవటానికి సిద్ధం అయిన విషయం తెలిసినా దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. దేవుడి మాన్యం భూమిని కబ్జా చేసేందుకు ఓ వైసీపీ నాయకుడు సిద్ధమయ్యాడు. తన దగ్గర భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉన్నాయని బుకాయిస్తున్నాడు.

తాడికొండ గ్రామంలోని వేణుగోపాలస్వామి వారి ఆలయానికి సంబంధించిన భూములు సర్వే నెంబరు 100, 170ఏ, 120, 99లో 15.45 ఎకరాలు దేవుడి మాన్యం ఉంది. దీనిలో సుమారు 60 సెంట్ల భూమిని చదును చేసి రాత్రి రాత్రికే గోతులు తీసి సిమెంటు పిల్లర్లు వేశారు. దేవుడి మాన్యాన్ని కొన్ని సంవత్సరాలుగా గ్రామానికి చెందిన కూరపాటి శివయ్య కౌలు చేసుకుంటున్నారు. అయితే పొలంలో సిమెంట్ పిల్లర్లు వేశారనే విషయం తెలిసిన శివయ్య అవాక్కయ్యారు. దీంతో దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. దీంతో అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పినా ఇంత వరకు ఎలాంటి ఫలితం లేదు. సిమెంటు పిల్లర్లు వేసి 10 రోజులు గడుస్తున్నా భూమిని ఆక్రమించిన వారిని గుర్తించి ఏలాంటి చర్యలు చేపట్టకపోవటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి తెలుగురాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు

పెదనందిపాడు, మే, 20 : గుంటూరు జిల్లా పెదనందిపాడు మండల పరిధిలోని వరగాని అంకమ్మగుడి ఆవరణలో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల 8వ ఆహ్వాన నాటికల పోటీలు నేటి రాత్రి నుండి ప్రారంభించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. దీనికి కావలసిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.

మొదటి రోజు అభినవ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్ర ప్రస్థం, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి కౌసల్యాసుప్రజారామ, తెలుగు కళాసమితి విశాఖ వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత అనే నాటికలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	158, 167,178
చికెన్ విత్ స్కిన్	306.00
చికెన్ స్కిన్ లెస్	316.00

పల్నాడు వార్తలు

చివరి భూములకు సాగునీరు అందేనా!

● ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని మేజర్, మైనర్ కాల్వలు
● సాగుకు సమాయత్తమవుతున్నా మరమ్మతులు చేపట్టరా?


తూటాకు, నాచుతో నిండిన ఆకురాజుపల్లె మేజర్ కాలువ

పిడుగురాళ్ల, మే 20: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులపై చిన్నచూపు ప్రదర్శిస్తుంది. ఎన్నికల ముందు ఇచ్చిన అనేక హామీలను తుంగలో తొక్కిన ఆ పార్టీ నేతలు రైతులను కూడా నట్టేట ముంచారు. పల్నాడు ప్రాంతంలో వ్యవసాయంపైనే రైతులు అధికంగా ఆధారపడి ఉన్నారు. సాగర్ కాల్వల ద్వారా చివరి భూముల వరకు సాగునీరు అందితేనే ఆ భూముల్లో రైతులు తమకు అనుకూలమైన పంటలను సాగు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. టీడీపీ హయాంలో సాగర్ కాల్వల మరమ్మతులు చేయడం మినహా వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఎక్కడా కూడా కాల్వల మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. తంగెడ, ఆకురాజుపల్లె మేజర్ కాల్వల పరిధిలో పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, కారంపూడి మండలాల పరిధిలో వేలాది ఎకరాలు సాగుభూమి వుంది. ముఖ్యంగా మాచవరం, దాచేపల్లి మండలాల్లో చివరి సాగుభూములకు నీరందాలంటే ఏడాదికి ఒక్కసారైనా మేజర్, మైనర్ కాల్వల్లో పూడిక, తూటాకు, నాచు, జమ్మును తొలగిస్తే తప్ప సాగునీరు అందటం కష్టంగా ఉంటుంది. అలాంటిది ఈ ఐదేళ్లలో మరమ్మతులే చేయకపోవడం వల్ల చివరి భూముల్లో సాగుచేయడం రైతులకు కష్టంగా మారింది. సాగు నీరు అందకపోవడం వల్ల కొంతమంది రైతులు బోర్ల సాయంతో పంటలు పండించుకోగా మరికొందరు గత ఏడాది ఏ పంట వేయక భూములన్నీ ఖాళీగానే ఉన్నాయి.

ముందస్తు ప్రణాళిక ఏదీ..?

మరో నెలరోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న వేళ పల్నాడు ప్రాంతంలోని మేజర్, మైనర్ సాగర్ కాల్వలన్నీ జమ్ము, తూటాకుతో నిండిపోయి ఉన్నాయి. ఇప్పటికే కురుస్తున్న వర్షాలతో అవికాస్త పెరిగాయి. వర్షాలు ఇదే విధంగా కురిస్తే కాల్వల మరమ్మతులు చేపట్టడం కష్టంగా ఉంటుంది. వ్యవసాయశాఖ, సాగునీటి శాఖ అధికారులు పొలాలకు సాగునీరు అందించే ప్రణాళిక రూపొందించకపోవడం వల్ల ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా సాగర్ కాల్వల మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగుకు సమయం ఆసన్నమైనా అధికార యంత్రాంగం కాల్వల మరమ్మతులు ప్రారంభించకపోవడం చూస్తే ముందస్తు ప్రణాళిక అధికారుల్లో కనిపించడం లేదనేది రైతుల నుంచి ఆవేదన వ్యక్తమవుతుంది.


పాఠశాలను ప్రారంభిస్తున్న విశ్రాంత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ


విద్యార్థుల ఆసక్తినిబట్టి తీర్చిదిద్దాలి

● విశ్రాంత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

నరసరావుపేట లీగల్, మే 20: విద్యార్థులు ఏ రంగంలో ఆసక్తి కనబరుస్తున్నారో గమనించి ఆయా రంగాల్లో నిపుణులుగా వారిని విద్యా సంస్థలు తీర్చిదిద్దాలని విశ్రాంత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ అన్నారు. సోమవారం ఉదయం మండలంలోని కేసానుపల్లి వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి, పాఠశాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన భాషా, సంస్కృతి పెంపొందించేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యాసంస్థలదేనన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించి తర్ఫీదును ఇవ్వాలన్నారు. అంతర్జాతీయస్థాయి పాఠశాలను అందుబాటులోకి తెచ్చిన డాక్టర్ నాగోతు ప్రకాశరావు కుటుంబసభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల వ్యవస్థాపకుడు, కార్యదర్శి డాక్టర్ నాగోతు ప్రకాశరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి కష్టాలతో విద్యాభ్యాసం చేసి వైద్యుడిగా ఎదిగిన తనకు చదువు విలువ తెలుసని, ఆరు నెలలుగా శ్రమించి ఈ పాఠశాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అనంతరం పాఠశాలలో జరిగిన ప్రతిభా పాటవ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ముఖ్యఅతిథి జస్టిస్ ఎన్వీ రమణ బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి నేషనల్ ఫ్రాంచైజీ సుభాష్ కలువ అధ్యక్షత వహించారు. తొలుత ఎన్వీ రమణకు పాఠశాల వద్ద యాజమాన్యం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ చక్రధర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆశీర్వాదం పాల్, ఎస్ఎస్ రాజు, లక్ష్మణరావు, చైర్మన్ వేములపల్లి వెంకటనరసయ్య, ఆర్డీవో సరోజిని, రావెల సత్యనారాయణ, నలబోతు వెంకటరావు, నాగోతు శౌరయ్య, బార్ అసోసియేషన్ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

క్రోసూరు, మే 20: మండలంలోని 88 తాళ్ళూరులో ఉన్న అమరవీరుల స్మారక స్థూపం వద్ద సోమవారం పుచ్చలపల్లి సుందరయ్యకు పలువురు సీపీఎం నాయకు లు ఘన నివాళులర్పించారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గంజిమాల రవిబాబు, సీనియర్ సీపీఎం నాయకులు ఆవుల ఆంజనేయులు, అత్తోట బాలయ్య తదితరులు ప్రసంగించారు. గ్రామానికి చెందిన దాట్ల గురవ రాజు విగ్రహానికి కూడా ఈ సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తమ్మిశెట్టి హనుమంతరావు, ఏపూరి వెంకటేశ్వర్లు, అత్తోట వెంకట అప్పారావు, బిక్షాలు, గంటెల చిన్నప్ప, షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుచ్చలపల్లి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు-2 బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... పచ్చల శేషయ్య గారి కుమారుడు పచ్చల రాజశేఖర్ గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. రాఫున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు పచ్చల రాజశేఖర్ గారికి ఋణం మంజూరు చేయును. షెడ్యూలు : 1వ ఐటెం : గుంటూరు డి. మంగళగిరి సబ్.డి., యిలాకా, తాడేపల్లి మండలం, పెనుమాక గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన పెనుమాక గ్రామ కంఠ డి.నెం. 183లో యి. 5-12సెంట్ల విలువలో మనకు హక్కు కలిగిన పెనుమాక గ్రామం, డోరు నెం. 8-82కు సమీపమున గల చ.గ. 223ల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు తూర్పు : దోమా పెదగోపాలరావు గారి ఆస్తి హద్దు అ. 26.0లు, దక్షిణం: పంచాయితీ వారి రోడ్డు హద్దు అ. 77.2లు, పడమర : పంచాయితీ వారి రోడ్డు హద్దు అ. 26.0లు, ఉత్తరం : కొప్పులిగడ్డ మాణిక్యమ్మ గారి ఆస్తి హద్దు అ. 77.2లు, ఈ హద్దుల మధ్య చ.గ. 233లు లేక చ.మీ. 188.45ల స్థిరాస్తి స్థలము మాత్రం. DOC NO: 6355/2021, S.R.O. మంగళగిరి.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, దేవేంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

రైలు పట్టాలకు సమీపంలో పశువులను తీసుకురావొద్దు

● ఆర్పీఎఫ్ ఎస్ఐ వీరబాబు


పెదకూరపాడులో రైలు పట్టాలకు సమీపంలో నివసిస్తున్న వారికి అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ అధికారులు

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలకు సమీపంలో పశువులను మేపడం చేయొద్దని ఆర్పీఎఫ్ ఎస్ఐ వీరబాబు విజ్ఞప్తి చేశారు. అలానే అనుమతి లేని చోట పశువులను రైలుపట్టాలను దాటించొద్దని స్పష్టం చేశారు. సోమవారం పెదకూరపాడు గ్రామంలో రైల్వేట్రాక్ సమీపంలో నివసించే ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వీరబాబు మాట్లాడుతూ పశువులను రైలు ఢీకొట్టడం వలన అనేక నష్టాలు జరిగే అవకాశం ఉందన్నారు. అత్యవసర బ్రేకులు వేయడం వల్ల రైలు పట్టాలు తప్పే ప్రమాదం ఉందన్నారు. కొన్ని సందర్భాల్లో పశువుల కళేబరాలు లోకోలో ఇరుక్కుని నష్టం జరుగుతుందన్నారు. అంతేకాకుండా రైళ్ల సమయపాలన పూర్తిగా దెబ్బ తింటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో పశువులను రైలు పట్టాలకు సమీపంలో తీసుకు రావొద్దని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే రైల్వే చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు.

నిలిచిన పెదమద్దూరు హైలెవల్ వంతెన నిర్మాణం

● ఎన్నికల ముందు పనులు చేస్తున్నట్లు హడావిడి
● పోలింగ్ తరువాత ఎక్కడి పనులు అక్కడే అనే తీరు


పెదమద్దూరు వాగు వద్ద నిలిచిపోయిన హైలెవల్ వంతెన నిర్మాణం

అమరావతి, మే 20: అమరావతి నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో పెదమద్దూరు సమీపంలోని వాగుపై ఉన్న లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరి పడిపోయే స్థితిలో ఉంది. దీనికి సంబంధించి అధికార పార్టీ తుళ్లూరు నుంచి అమరావతి వరకు దెబ్బతిన్న రహదారితో పాటు పెదమద్దూరు వాగుపై నూతన వంతెన నిర్మాణానికి రూ.44కోట్లు మంజూరయ్యాయని స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు 2022 అక్టోబరు 27వ తేదీన పెదమద్దూరు వాగు వద్ద మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించి త్వరగా పనులు పూర్తి చేస్తానని ప్రకటించారు. విజయవాడ రోడ్డులోని హరిశ్చంద్రపురం నుంచి పెదమద్దూరు వరకు నాలుగు చిన్నపాటి కల్వర్టులు నిర్మించి వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. వంతెనకు సంబంధించిన సపోర్టు స్తంభాలను పాత వంతెన పక్కనే ఉత్తరం వైపున ఏర్పాటు చేశారు. తరువాత కొన్నినెలల పాటు చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకపోవడంతో వంతెన నిర్మాణం నిలుపుదల చేసి వెళ్లిపోయాడు. తరువాత ప్రజల నుంచి విమర్శలు రావడంతో ఎమ్మెల్యే శంకరరావు కాంట్రాక్టర్‌తో చర్చించి వంతెన పూర్తి చేయాలని ఆదేశించగా ఎన్నికలు పూర్తయ్యేవరకు స్తంభాల ఎత్తు పెంచి శ్లాబ్ మట్టానికి తీసుకువచ్చారు. పోలింగ్ పూర్తయ్యేసరికి వంతెన వద్ద నిర్మాణ సామగ్రి కానీ, పనులు చేస్తున్నట్లుగాని కనిపించడం లేదు. బీటీ రహదారి నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. దీంతో రహదారి, వంతెన నిర్మాణం అటకెక్కినట్లేనని పెదమద్దూరు గ్రామస్థులు చెప్పుకుంటున్నారు. నూతన ప్రభుత్వమైనా ఆగిపోయిన పనులను పూర్తి చేస్తుందన్న ఆశతో వారున్నారు. వెంటనే వంతెన నిర్మాణం పూర్తి చేయకపోతే వర్షాకాలంలో వాగుకు వరదలు వచ్చి విజయవాడ వైపు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందంటున్నారు.


అమరావతి తుళ్లూరు రోడ్డు నిర్మాణానికి ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలకం


అమరావతి విజయవాడ రహదారి దుస్థితి

మాచవరంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ నిర్వహణ : ఎంఈవో


మాచవరంలో జూనియర్ కాలేజీ నిర్వహణ గురించి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎంఈవో, హెచ్ఎం తదితరులు

మాచవరం, మే 20: మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 2024-25 సంవత్సరానికి సంబంధించి జూనియర్ కళాశాల తరగతుల నిర్వహణ జరుగుతుందని ఎంఈవో శ్రీధర్ సోమవారం తెలిపారు. మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో ఎంపీసీ, సీఈసీ ఇంగ్లిషు మీడియంలో తరగతులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. దీనిలో భాగంగా మాచవరంలో ఎంఈవోతో పాటు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సురేష్‌బాబు, పలువురు ఉపాధ్యాయులు కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాచవరం, వేమవరం, మోర్జంపాడు, పిన్నెల్లి, పిల్లుట్ల తదితర గ్రామాల నుంచి తల్లిదండ్రులను కలిసి జూనియర్ కళాశాలలో చేర్పించాల్సిందిగా కోరారు. జూన్ 1వ తేదీ నుంచి క్లాసులు నిర్వహిస్తామని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన ఉంటుందని, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌ల సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని కోరారు.

144 సెక్షన్ మద్యం వ్యాపారులకు వర్తించదా?!



మద్యం షాపు వద్ద గుమిగూడిన మందుబాబులు

దాచేపల్లి, మే 20: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పల్నాడు ప్రాంతంలో జరిగిన అల్లర్లపై ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకోవడంతో 144 సెక్షన్ పల్నాడు ప్రాంతంలో అమలు చేస్తున్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పుడు నలుగురికి మించి జనం ఉండరాదు.. గుంపులు గుంపులుగా ఉండటం, సభలు, సమావేశాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం. కానీ ప్రభుత్వ వైన్‌షాపుల వద్ద, రెస్టారెంట్ల వద్ద, పంజాబీ దాబాల వద్ద, బిర్యాని పాయింట్‌లలోనూ మద్యం అమ్మకాలు జరుగుతున్నా అధిక సంఖ్యలో మద్యంబాబులు ఉన్నా పట్టించుకునే వారు లేకపోవడం సామాన్య ప్రజలను ప్రశ్నిస్తుంది. ఈ 144 సెక్షన్ సామాన్య ప్రజలకే వర్తిస్తుందా.. ఇతర దాబాలకు, రెస్టారెంట్‌లకు మద్యం షాపులకు వర్తించదా.. వారికొక న్యాయం... మాకొక న్యాయమా అంటూ ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. దాచేపల్లి పట్టణంలో కిరాణా, వస్త్ర, తదితర వాణిజ్య సముదాయాలను అధికారులు బెదిరించి మూసి వేయిస్తున్నారు. అయితే దాబాలకు, మద్యంషాపులకు, రెస్టారెంట్లకు ఇటువంటి సెక్షన్ అమలు చేయకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు చట్టాలను అన్ని వర్గాల వారికి అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా భాస్కరరావు


చిలకా భాస్కరరావు

క్రోసూరు, మే 20: ఎస్సీ ఎస్టీ, రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా క్రోసూరుకు చెందిన చిలకా భాస్కరరావు నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు నుంచి ఆయన నియామకపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం నుంచి ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు, వారికి రావాల్సిన సంక్షేమాలను సాధించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా నియామక పత్రంలో కోరారు. చిలకా భాస్కరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రభుత్వం ద్వారా అందే పథకాలను అట్టడుగు స్థాయిలో ఎస్సీ, ఎస్టీలకు అందజేసేందుకు పాటు పడతానని తెలియజేశారు. కౌన్సిల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గార్లపాటి దాసు తదితరులు భాస్కరరావును అభినందించారు.

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

అచ్చంపేట, మే 20: మండలంలోని వేల్పూరు పంచాయతీ పరిధిలోని క్రోసూరు సెంటర్‌లో సోమవారం గుర్తు తెలియని మృత దేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు అచ్చంపేట సీఐ ఎస్‌కే కరీముల్లా షావలి తెలిపారు. మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. సుమారు 35 సంవత్సరాలు వయస్సు కలిగిన ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే సత్తెనపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలలో ఉంచినట్టు ఆయన తెలిపారు. సిమెంట్ కలర్ ఫ్యాయింట్‌తో పాటు బిస్కెట్ కలర్ టీ షర్టు ధరించి ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

రేపు లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం

కారంపూడి, మే 20: మండలంలోని పేటసన్నిగండ్ల శివారులో ఉన్న సింగరుట్ల లక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా ఈనెల 22వ తేదీన స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలతో సింగరుట్ల క్షేత్రానికి చేర్చనున్నారు. 9 గంటలకు సుదర్శన హోమం, సాయంత్రం 5 గంటలకు ఎదురుకోల, రాత్రి 8 గంటలకు శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యాన అన్నదానం జరపనున్నారు.

టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు

● అంబటిని ఏ1 ముద్దాయిగా చేర్చాలి
● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు

సత్తెనపల్లి, మే 20: గడిచిన ఐదేళ్ల పాలనలో మంత్రి అంబటి రాంబాబు టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేయించి వేధింపులకు గురి చేశాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, టీడీపీ నేతలు అన్నారు. సోమవారం కన్నా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారం కోల్పోతున్నామని తెలిశాక మంత్రి అంబటి అధికారులపై విమర్శలు చేస్తున్నాడన్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లపై తప్పుడు ఆరోపణలు మానుకోకపోతే రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఘర్షణలకు ప్రధాన సూత్రధారి రాంబాబు, జగన్మోహన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు చేసిన దాడుల్లో రాంబాబును ఏ-1 ముద్దాయిగా నమోదు చేయాలన్నారు. నియోజకవర్గంలో ఏడాది నుంచి టీడీపీ కార్యకర్తలపై రాళ్ళ దాడులు, అమాయకులపై అక్రమ కేసులు నమోదు చేయించారన్నారు. కన్నా లక్ష్మీనారాయణ మీద గెలవలేక పథకం ప్రకారం పోలింగ్‌ను అడ్డుకోవటానికి వైసీపీ గూండాలతో నియోజకవర్గంలోని చాగంటివారిపాలెం, మాదల, ధూళిపాళ్ళ, రెంటపాళ్ళ, బలిజేపల్లి గ్రామాల్లో ఓట్లు వేయటానికి వెళ్తున్న టీడీపీ సానుభూతి పరులపై కర్రలు, రాళ్ళు, రాడ్లతో దాడులు చేయించారన్నారు. ఈ దాడులపై సిట్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. నూతన కలెక్టర్, ఎస్పీ కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించి వైసీపీ గూండాలను అరెస్టు చేయించి బాధితులకు అండగా నిలవాలన్నారు. సమావేశంలో పూజల వెంకట కోటయ్య, తొరటి వెంకటరావు, అంచుల నరసింహారావు తదితరులు ఉన్నారు.

గొడవల సూత్రధారి అంబటి

సత్తెనపల్లి, మే 20 : సత్తెనపల్లి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తల దాడులకు ప్రధాన సూత్రధారి అంబటి రాంబాబు అని టీడీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సెల్ నేతలు అన్నారు. సోమవారం సాయంత్రం టీడీపీ ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్‌ను అడ్డుకోవటానికి వైసీపీ గూండాలే మారణహోమం సృష్టించారన్నారు. నియోజకవర్గంలో ఓటమి ఖాయమని తెలిసినా అంబటి రాంబాబు దాడులను ప్రోత్సహించారన్నారు. నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై జరిగిన దాడుల వెనుక అంబటి హస్తం ఉందన్నారు. అంబటిని కూడా కేసులో నిందితుడిగా చేర్చి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కొర్రపాటి సురేష్, తిరు వీధుల శంకర్ ప్రసాదు, నిజాముద్దీన్, రత్నకుమారి తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ అధికారులే బలవుతున్నారు

● జైభీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్

సత్తెనపల్లి, మే 20: రాష్ట్రంలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా ఇందుకు ఎస్సీ, ఎస్టీ అధికారులే బలవుతున్నారని జైభీమ్ భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయ కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత జరిగిన బదిలీల్లో ఎక్కువ శాతం ఆయా వర్గాల అధికారులను బలి చేశారన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌పై చర్యలు తీసుకోవటం ఇందులో భాగమేనన్నారు. ఈ విధానాలను సంబంధిత ఉన్నతాధికారులు విడనాడాలన్నారు.

నేడు ఆలయాల వార్షికోత్సవాలు

నకరికల్లు, మే 20 : మండలంలోని కుంకలగుంటలో ఉన్న శ్రీ భద్రకాళి ఉత్కంఠ వీరభద్రస్వామి దేవాలయంలో ప్రథమ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. గ్రామంలోని కార్య సిద్ధి వినాయక స్వామి దేవాలయంలోను, వార్షికోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

పులివర్తి నానికి భాష్యం ప్రవీణ్ పరామర్శ


పులివర్తి నానిని పరామర్శిస్తున్న భాష్యం ప్రవీణ్

క్రోసూరు, మే 20: ఇటీవల ప్రత్యర్థుల దాడిలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి పులివర్తి నానిని ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సోమవారం పరామర్శించారు. చంద్రగిరిలోని ఆయన గృహానికి వెళ్లి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. సంఘటన వివరాలను, దాడి జరిగిన విధానాన్ని పులివర్తి నాని ప్రవీణ్‌కు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల రోజు ఆ తరువాత ఉగ్రమూకలుగా మారారని, ఇష్టమొచ్చినట్లుగా విచక్షణ రహితంగా టీడీపీ వారిపై దాడులు నిర్వహించారని పులివర్తి నాని చెప్పారని బాష్యం ప్రవీణ్ తెలియజేశారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి వస్తుండగా సుమారు 150 మంది రౌడీ మూకలు, కిరాయి మూకలు, వైసీపీ గూండాలు కత్తులు, రాడ్లు, సమ్మెటలు పట్టుకొని కారుపై ఎగబడ్డారని, భయానక వాతావరణం నెలకుందని నాని ప్రవీణ్‌కు తెలియజేశారు. పులివర్తి నాని త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

కారంపూడి ఎస్ఐగా అమీర్ బాధ్యతల స్వీకరణ


ఎస్ఐ అమీర్

కారంపూడి, మే 20: కారంపూడి ఎస్ఐగా అమీర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై కారంపూడికి వచ్చారు. కాగా ఇప్పటి వరకు విధులు నిర్వహించిన రామాంజనేయులును కారంపూడిలో పోలింగ్ మరుసటి రోజు జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసింది.

విజయపురిసౌత్ ఎస్ఐగా పట్టాభి రామయ్య


ఎస్ఐ పట్టాభిరామయ్య

విజయపురిసౌత్, మే 20: విజయపురిసౌత్ నూతన ఎస్ఐగా మేదరమెట్ల పట్టాభి రామయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు గొడవలు, అల్లర్లు సృష్టించకుండా పోలీసులకు సహకరించాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో బొల్లాపల్లి, ఈపూరు, ముప్పాళ్లలో విధులు నిర్వహించి విజయపురిసౌత్‌కు వచ్చారు.

బాటిళ్లు, క్యాన్లలో పెట్రోల్ నింపితే కఠిన చర్యలు

● పట్టణ సీఐ బ్రహ్మయ్య

మాచర్ల రూరల్, మే 20: వినియోగదారులకు ఖాళీ వాటర్ బాటిళ్లు, క్యాన్లలో పెట్రోల్ నింపితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు. పోలింగ్ సమయంలో జిల్లాలో పలుచోట్ల పెట్రోల్ బాంబులు ఉపయోగించడంతో కౌంటింగ్ అనంతరం పెద్ద ఎత్తున హింస జరగవచ్చనే నిఘా వర్గాలు సమాచారం మేరకు పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను అమలుపరిచేందుకు సీఐ బ్రహ్మయ్య సోమవారం పట్టణంలోని పెట్రోలు బంకులకు నోటీసులు అంటించారు. పెట్రోలు బంకులపై పోలీసులు నిఘా కొనసాగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా యజమానులు వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మోర్జంపాడులో పోలీసు కార్డెన్ సెర్చ్

● పత్రాలు లేని బైక్‌లు పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

మాచవరం, మే 20: ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకొని ముందస్తు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోర్జంపాడు గ్రామంలో సోమవారం పోలీసు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ అమీనుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రతి ఇంటిని సోదా చేశారు. అనుమతి పత్రాలు లేని బైక్‌లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఊరేగింపులకు, ర్యాలీలకు అనుమతి లేదు : డీఎస్పీ


డీఎస్పీ గురునాథబాబు

సత్తెనపల్లి, మే 20 : సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదని సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్తెనపల్లి, పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎలాంటి ర్యాలీలకు, ఊరేగింపులకు జూన్ 4వ తేదీ వరకు అనుమతి లేదన్నారు. ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 144వ సెక్షన్ అమల్లో ఉండటం వల్ల నలుగురికి మించి గుమ్మి కూడకూడదన్నారు. అన్ని రకాల దుకాణాలు రాత్రి 9 గంటలకు మూసి వేయాలన్నారు. సమస్యలు సృష్టించే వారిపై ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. రౌడీ షీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు

● ఎస్ఐ విప్పర్ల వెంకటరావు

పెదకూరపాడు, మే 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా హింసాత్మక చర్యలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ విప్పర్ల వెంకటరావు అన్నారు. మండలంలోని కంభంపాడు, బలుసుపాడు, 75 తాళ్ళూరు, హుస్సేన్ నగరం, పెదకూరపాడు గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రజలు సహకరించాలని, ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని ఎస్ఐ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచవరం, మే 20: మాచవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో మంగళవారం కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పెదమస్తాన్ సోమవారం తెలిపారు. మాచవరం, కొత్తపాలెం, తురకపాలెం, గంగిరెడ్డి పాలెం గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, సబ్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న మరమ్మతులు పూర్తికాకపోవడంతో రెండో రోజు కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ద్విచక్ర వాహనం దగ్ధం


దగ్ధమైన ద్విచక్ర వాహనం

మాచర్లటౌన్, మే 20: పట్టణంలోని 22వ వార్డులో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పంటించి దగ్ధం చేశారు. మహంకాళి పిచ్చయ్య తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి సమయంలో కేకలు వినపడడంతో బయటకు వచ్చి చూడగా ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ బ్రహ్మయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



పాఠశాలను ప్రారంభిస్తున్న
విశ్రాంత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

విద్యార్థుల ఆసక్తినిబట్టి తీర్చిదిద్దాలి

● విశ్రాంత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

నరసరావుపేట లీగల్, మే 20: విద్యార్థులు ఏ రంగంలో ఆసక్తి కనబరుస్తున్నారో గమనించి ఆయా రంగాల్లో నిపుణులుగా వారిని విద్యా సంస్థలు తీర్చిదిద్దాలని విశ్రాంత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ అన్నారు. సోమవారం ఉదయం మండలంలోని కేసానుపల్లి వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి, పాఠశాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన భాషా, సంస్కృతి పెంపొందించేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యాసంస్థలదేనన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించి తర్ఫీదును ఇవ్వాలన్నారు. అంతర్జాతీయస్థాయి పాఠశాలను అందుబాటులోకి తెచ్చిన డాక్టర్ నాగోతు ప్రకాశరావు కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల వ్యవస్థాపకుడు, కార్యదర్శి డాక్టర్ నాగోతు ప్రకాశరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి కష్టాలతో విద్యాభ్యాసం చేసి వైద్యుడిగా ఎదిగిన తనకు చదువు విలువ తెలుసని, ఆరు నెలలుగా శ్రమించి ఈ పాఠశాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అనంతరం పాఠశాలలో జరిగిన ప్రతిభా పాటవ పరీక్షలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ముఖ్య అతిథి జస్టిస్ ఎన్వీ రమణ బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి నేషనల్ ప్రాంఛైజీ సుభాష్ కలువ అధ్యక్షత వహించారు. తొలుత ఎన్వీ రమణకు పాఠశాల వద్ద యాజమాన్యం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ చక్రధర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆశీర్వాదం పాల్, డాక్టర్ ఎన్ఎస్ రాజు, లక్ష్మణరావు, చైర్మన్ వేములపల్లి వెంకటనరసయ్య, ఆర్డీవో సరోజిని, రావెల సత్యనారాయణ, డాక్టర్ నలబోతు వెంకటరావు, నాగోతు శౌరయ్య, బార్ అసోసియేషన్ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ సిలబస్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

నరసరావుపేట కల్చరల్, మే, 20: రాష్ట్రంలో సీబీఎస్ఈ సిలబస్‌పై ప్రత్యేకంగా ఎంపిక చేసిన 1000 పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రెండ్రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయబడింది. ఇందులో భాగంగా పల్నాడు జిల్లాలోని 67 సీబీఎస్ఈ పాఠశాలల్లో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని శంకరభారతీపురం ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. శిక్షణ కేంద్రాన్ని గుంటూరు ఆర్‌జెడి ప్రారంభించారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో 9, 10 తరగతులకు సంబంధించి విషయ నిపుణలతో వార్షిక ప్రణాళికానుసారం శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి యం.వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులను ప్రపంచస్థాయి పోటీలకు అనుగుణంగా తీర్చిదిద్దే క్రమంలో ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

దళితులు, బీసీలపై దాడిచేస్తే తీవ్ర పరిణామాలు

● బీఎస్పీ నాయకుల హెచ్చరిక

వినుకొండ, మే 20: వినుకొండ నియోజకవర్గంలో దళితులతో పాటు, ఇతర బలహీలవర్గాలపై దాడిచేస్తే, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బీఎస్‌పీ అసెంబ్లీ నియోజకవర్గం నాయకులు మసిపోగు ఏసోబు హెచ్చరించారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గుట్టపల్లి, కొండ్రముట్ల, కొచ్చర్ల, ముప్పాళ్ళ, వెల్లటూరు, పేర్లపాడు, బొల్లాపల్లి, నాగులవరం, పాత ఉప్పలపాడు, జంగాలపల్లి, ఏనుగులపాడు, చాట్రగడ్డపాడు, తదితర గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీలపై రాజకీయపార్టీలతో పాటు, పెత్తందారులు దాడులు చేశారని, ఈ ఘటనలపై బాధ్యులైన వారందరిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌తో పాటు డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. దాడులకు పాల్పడిన అగ్రవర్ణాలకు చెందిన వారిపై ఐపీసీ సెక్షన్ 307, 120బీ, 147, 148, 149 సెక్షన్ల కింద ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఏసోబు డిమాండ్ చేశారు. కార్యక్రమం బీఎస్పీ నాయకులు రాంబాబు, కంభంపాటి నాగవంశీ, పూనూరు జాన్సన్, రామావత్ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీగా సుధాకరరావు బాధ్యతల స్వీకారం

నరసరావుపేట లీగల్, మే 20: నరసరావుపేట డీఎస్పీగా సుధాకరరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన నరసరావుపేట దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీగా సేవలందించారు. ఎన్నికల అనంతరం పట్టణంలో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలకు సంబంధించి డీఎస్పీ వర్మను సస్పెండ్‌చేసిన విషయం విదితమే. ఆయన స్థానంలో సుధాకరరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇదే ఘటనకు సంబంధించి సస్పెండ్ ఐన పల్నాడు జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐలు కందుల ప్రభాకరరావు, ఈ బాల నాగిరెడ్డిల స్థానంలో యా శోభన్‌బాబు, బండారు సురేష్ బాబులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



బాధ్యతలు స్వీకరిస్తున్న
డీఎస్పీ సుధాకరరావు

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

వినుకొండ టౌన్, మే 20: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన వినుకొండ నుంచి నర్సరావుపేట వైపు వెళ్లే చెక్కువాగు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు శరీరంపై బ్లూరంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి శరీరంపై ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9948525386 నెంబరును సంప్రదించాలన్నారు.



రైలు కిందపడి
గుర్తు తెలియని వ్యక్తి మృతి

విద్యార్థులకు స్కాలర్ షిప్‌ల పంపిణీ

బొల్లాపల్లి, మే 20: మండలంలోని రాజానాయక్ తండాకు చెందిన ఆల్ ఇండియా బంజార సంఘం రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు జాట్రావత్ రాంబాబు నాయక్ జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలోని గిరిజన విద్యార్థులకు, 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు, రాజానాయక్ తండాలో నియోజకవర్గంలోని 45మంది విద్యార్థులకు ప్రతి ఒక్కరికి రూ.5వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజార జాతుల అభ్యున్నతికి పాటుపడతామన్నారు. పేద విద్యార్థులను ఆదుకొని పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామ్‌నాయక్, బాబునాయక్, ఏడుకొండలు నాయక్, గ్రామస్తులు, గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను పంపిణీ చేస్తున్న ఆల్ ఇండియా బంజార సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు రాంబాబు నాయక్

రిటర్నింగ్ అధికారులదే తుది నిర్ణయం

● పోస్టల్ బ్యాలెట్‌లను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే లెక్కించాలి

● జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బాలాజీ లత్కర్



ఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీ లత్కర్

నరసరావుపేట మే 20: ఓట్ల లెక్కింపు సమయంలో రిటర్నింగ్ అధికారి ఏ నిర్ణయం తీసుకుంటారో అదే తుదినిర్ణయమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీ లత్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో 4న జరిగే ఓట్ల లెక్కింపుకు ముందస్తు ఏర్పాట్లపై ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో అయన సోమవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఆయా నియోజకవర్గాలలో శాంతి భద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఓట్ల లెక్కింపులో ఆయా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఎన్నికల కమిషన్ కౌంటింగ్‌కు సంబంధించిన పలు విషయాలను పుస్తకం రూపంలో ముద్రించడం జరిగిందని దీనిని ప్రతి ఒక్క రిటర్నింగ్ అధికారి చదివి పరిజ్ఞానం పొందాలన్నారు. ఫలితాలు ప్రకటించిన అనంతరం సంబంధిత ఈవీఎంలు, వీవీ ప్యాట్ సక్రమంగా పటిష్టమైన బందోబస్తు ద్వారా స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చాలన్నారు. అందుకు అవసరమైన సిబ్బందిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని, నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. అబ్జర్వర్, పోటీలో ఉన్న వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్ తెరవాలని ఇందుకు అవసరమైన చురుకైన కౌంటింగ్ సిబ్బందిని నియమించుకోవాలి, పార్లమెంటుకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బంది, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బంది వేర్వేరుగా నియమించాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి కూడా ప్రత్యేకమైన శిక్షణ కార్యక్రమాలు ఆయా నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించాలన్నారు. కౌంటింగ్‌లో పాల్గొనే ప్రతి ఒక్క సిబ్బందికి కచ్చితంగా గుర్తింపు కార్డు ఉండాలని, వివిధ రాజకీయ పార్టీల పార్టీ ఏజెంట్లు కూడా కచ్చితంగా గుర్తింపు కార్డు ధరించి ఉండాలన్నారు. డేటా ఎంట్రీలో చురుకైన సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ పెదకూరపాడు రిటర్నింగ్ అధికారి శ్రీరాములు, సత్తెనపల్లి రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ, చిలకలూరిపేట రిటర్నింగ్ అధికారి నారద ముని, వినుకొండ రిటర్నింగ్ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

● శావల్యాపురం ఎస్ఐ చల్లా సురేష్

బొందిలిపాలెం (శావల్యాపురం) మే 20: గ్రామాలలో ఎవరైనా రాజకీయ అల్లర్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చల్లా సురేష్ అన్నారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న కార్డన్ తనిఖీలలో భాగంగా మండలంలోని బొందిలిపాలెంలో పోలీసులు సోమవారం విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో వీధులన్నీ తిరుగుతూ అనుమానాస్పద ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీచేశారు. ఆధారాలు సరిగా లేని 9 ద్విచక్రవాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిశాక వివిధ గ్రామాల్లో చెలరేగిన రాజకీయ అల్లర్ల నేపథ్యంలో మారణాయుధాలు, నాటుబాంబుల నిల్వలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో ఏవైనా వివాదాలుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలంతా శాంతియుతంగా కలసిమెలసి ఉండాలని, లేనిపోని గొడవల్లో తలదూర్చి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. తనిఖీలలో ఐనవోలు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి, కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.



బొందిలిపాలెంలో సరైన పత్రాలు లేని
బైకులను స్వాధీనం చేసుకొన్న పోలీసులు

పమిడిపాడులో...

నూజెండ్ల, మే 20: మండలంలోని పమిడిపాడులో రూరల్ సీఐ సుధాకర్ బాబు ఆధ్వర్యంలో ఐనవోలు, శావల్యాపురం ఎస్ఐలు ఎం.లక్ష్మీనారాయణరెడ్డి, సీహెచ్ సురేష్‌లు సిబ్బందితో గ్రామంలో ప్రతి ఇంటిని, కొష్టాలు, వాములు, షెడ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామంలో తొమ్మిది ద్విచక్ర వాహనాలకు సరైన పత్రాలు లేకపోవటంతో స్వాధీనం చేసుకున్నట్లు ఐనవోలు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

రొంపిచర్లలో కార్డన్ సెర్చ్

రొంపిచర్ల, మే 20: మండల కేంద్రమైన రొంపిచర్లలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రత్యేక బలగాలు, రొంపిచర్ల పోలీసులు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. ఎన్నికల అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేపడుతున్నట్టు ఎస్ఐ పాల్‌రాజ్ రవీంద్ర తెలిపారు. మండలానికి ప్రత్యేక బలగాలను కేటాయించారని పేర్కొన్నారు. ఎక్కడైనా మారణాయుధాలు, బాంబులు ఉన్నట్టు సమాచారం ఇస్తే వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

చిలకలూరిపేట రూరల్ మండలంలో...

చిలకలూరిపేట, మే 20: చిలకలూరిపేట మండలం పోతవరం, రాజాపేట గ్రామాల్లో చిలకలూరిపేట రూరల్ సీఐ వీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ గ్రామాల్లో పలు గృహాలను తనిఖీచేశారు. అనుమానాస్పద వస్తువుల కోసం సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలు లేని మూడు మోటారు సైకిళ్ళను పోతవరం గ్రామంలో, మరొక మోటారు సైకిల్‌ను రాజాపేట గ్రామంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్డెన్ సెర్చ్‌లో రూరల్ ఎస్ఐలు జీ రవి కృష్ణ, వీ బాలకృష్ణ పాల్గొన్నారు.

చందవరంలో...

నాదెండ్ల, మే 20: మండలంలోని చందవరంలో పోలీసులు సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. సమస్యాత్మకమైన గ్రామం కావటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు బృందం ఈ తనిఖీలు నిర్వహించింది.



చిలకలూరిపేట మండలం రాజాపేట, శ్యావల్యాపురం మండలంలోని
బొందిలిపాలెంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వినుకొండ పట్టణంలో అస్తవ్యస్తంగా ట్రాఫిక్

● ట్రాఫిక్ నిలిచిపోయి వాహన చోదకులకు ఇక్కట్లు

● చోద్యం చూస్తున్న పోలీసులు, అధికారులు



శివయ్య స్థూపం సెంటర్‌లో
నిలిచిపోయిన ఆర్‌టీసీ బస్సులు

వినుకొండ టౌన్, మే 20: వినుకొండలో అస్తవ్యస్తమైన ట్రాఫిక్ సమస్య పెద్ద తలనొప్పిగా మారింది. గడిచిన కొద్దికాలంగా పట్టణ, గ్రామీణ ప్రాంతవాసులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక పక్క ఉక్కపోత, మరోపక్క ట్రాఫిక్‌తో సామాన్యులు కాలు బయట పెట్టాలంటే వణికిపోతున్నారు. నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పోలీసులకు కనిపిస్తున్నా ఏమీ చేయలేని పరిస్థితి. ఒకపక్క బందోబస్తులు, మరో పక్క అధికార పార్టీ నాయకుల ప్రొటోకాల్ పాటించడంలో పోలీసులు తలమునకలు అవుతున్నారు. ప్రజల సమస్యలు గాలికి వదిలేయడంతో పట్టణంలో ప్రధాన వీదులన్నీ ట్రాఫిక్ సమస్యలతో చిన్న, సన్న వ్యాపారులతో పాటు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రధానంగా శివయ్య స్థూపం సెంటర్‌లో కర్నూల్ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలతో పాటు, పట్టణం నుంచి ప్రధాన నగరాలకు వెళ్లే వాహనాలు టౌన్ దాటాలంటే గంటల సమయం పడుతోంది. వ్యాపార సముదాయాల వద్ద రోడ్డుకు అడ్డంగా ప్రకటన బోర్డులు ఏర్పాటు కొనసాగుతున్నపటికీ మున్సిపల్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరించడమే ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమని పట్టణ వాసులు వాపోతున్నారు. పట్టణంలో ద్విచక్రవాహనాలు పెరగడం, నిరుద్యోగ సమస్యలతో ఆటోలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోవటంతో రోడ్డులన్నీ వాహనాలతో నిండిపోతున్నాయి. దీంతో పట్టణంలోని మార్కాపురం రోడ్డు, నర్సరావుపేట రోడ్డు, ఆర్‌టీసీ బస్టాండ్ రహదారుల్లో వాహనాల తాకిడితో సామాన్యులు నరకం చూడాల్సిన పరిస్థితి. అత్యవసర పరిస్థితిలో అంబులెన్సులు కూడా కదలలేని పరిస్థితి. అనారోగ్యానికి గురైన గర్భిణులు వైద్యశాలకు వెళ్లాలన్నా, వృద్ధులు రోడ్డు దాటాలన్నా, నిత్యావసర వస్తులు కొనుగోలు చేసేందుకు ట్రాఫిక్‌తో ఇక్కట్లకు గురవుతున్నారు. రోడ్డు దాటలేని పరిస్థితి వినుకొండ రోడ్లపై నెలకొని ఉంది. ఇది ఇలా ఉండగా పట్టణంలోని లాయర్ స్ట్రీట్‌లో ఏర్పాటుచేసిన బ్యాంకులకు వచ్చే ఖాతాదారులతో పాటు, సామాన్యులు రోడ్డుపై నడవలేని పరిస్థితి ఉంది. ఉదయం 8 గంటల సమయంలో నిలిపిన ద్విచక్రవాహనాలతో స్కూల్ పిల్లలు పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యతో పట్టణంలో రోడ్లపై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మున్సిపల్, పోలీస్ అధికారులు ట్రాఫిక్ సమస్యలపై దృష్టిసారించి వాహన, సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగించి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



లాయర్ స్ట్రీట్, ముసలారెడ్డి హస్పటల్ వీధిలో
రోడ్డుపై నిలిపిన ద్విచక్ర వాహనాలు



షిర్డీ సాయిబాబా వీధిలో నిలిచిన ఆటోలు

144 సెక్షన్ మద్యం వ్యాపారులకు వర్తించదా?!

దాచేపల్లి, మే 20: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పల్నాడు ప్రాంతంలో జరిగిన అల్లర్లపై ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకోవడంతో 144 సెక్షన్ పల్నాడు ప్రాంతంలో అమలు చేస్తున్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పుడు నలుగురికి మించి జనం ఉండకూడదు. గుంపులు గుంపులుగా ఉండటం, సభలు, సమావేశాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం. కానీ ప్రభుత్వ వైన్‌షాపుల వద్ద, రెస్టారెంట్ల వద్ద, పంజాబీ దాబాల వద్ద, బిర్యానీ పాయింట్‌లలోనూ మద్యం అమ్మకాలు జరుగుతున్నా అధిక సంఖ్యలో మద్యంబాబులు ఉన్నా పట్టించుకునే వారు లేకపోవడంపై సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. ఈ 144 సెక్షన్ సామాన్య ప్రజలకే వర్తిస్తుందా.. ఇతర దాబాలకు, రెస్టారెంట్‌లకు మద్యం షాపులకు వర్తించదా.. అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దాచేపల్లి పట్టణంలో కిరాణా, వస్త్ర, తది తర వాణిజ్య సముదాయాలను అధికారులు బెదిరించి మూసివేయిస్తున్నారు. అయితే దాబాలకు, మద్యంషాపులకు, రెస్టారెంట్లకు ఇటువంటి సెక్షన్ అమలు చేయకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు చట్టాలను అన్నివర్గాల వారికి అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మద్యం షాపు వద్ద గుమిగూడిన
మందుబాబులు



కలెక్టర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీని, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠిని కలిసి మొక్కను అందిస్తున్న ఎస్పీ మాలికా గార్గ్

జిల్లా మూడో ఎస్పీగా మాలికా గార్గ్

నరసరావుపేట లీగల్, మే 20: జిల్లాకు మూడో ఎస్పీగా మాలికా గార్గ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఇద్దరు ఎస్పీలపై ఎన్నికల కమిషన్ చర్యలతో ఇక్కడి నుంచి వారు వెళ్లారు. చిలకలూరిపేట బొప్పూడి వద్ద జరిగిన ప్రధాని సభకు సంబంధించి భద్రతా వైఫల్యాల నేపథ్యంలో రవిశంకర్ రెడ్డిని బదలీచేశారు. పోలింగ్, ఆ తర్వాత జిల్లాలో జరిగిన హింసాత్మక సంఘటలను పురష్కరించుకొని జీ బిందుమాధవ్‌ను సస్పెండ్‌చేసిన విషయం తెలిసిందే. రెండేళ్లలోనే మూడో ఎస్పీగా మాలికా గార్గ్ బాధ్యతలు చేపట్టారు.

కలెక్టర్, ఐజీలను కలసిన ఎస్పీ మాలికా గార్గ్

ఎస్పీ మాలికా గార్గ్ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠిని, కలెక్టర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీని ఐజీ త్రిపాఠి, కలెక్టర్ లత్కర్ అభినందించారు.

జూదరుల వద్ద పోలీసుల చేతివాటం

● రూ.50వేలు పుచ్చుకుని వదిలేసిన వైనం

యడ్లపాడు, మే 20: పట్టణాల్లో పేకాట క్లబ్బులు మూతపడడంతో జూదరులు గ్రామాల్లోని తోటల్లో, పాడుబడిన భవనాలు లేదా మూతపడిన గోడౌన్‌లను అడ్డాలుగా మార్చుకుంటున్నారు. ఇంటిలిజెన్స్ సిబ్బంది సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించడంలేదు. ఒకవేళ దాడులు జరిపినా తృణమో ఫణమో తీసుకుని వదిలిపెడుతున్నారు. ఒకవేళ కేసు నమోదు చేయడం తప్పనిసరి అయితే పేకాట స్థావరాల్లో దొరికిన మొత్తం నుంచి కొంత నొక్కేసి నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా శనివారం యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామపరిధిలో ఓ మూతపడిన కంపెనీలో గుట్టుగా సాగుతున్న పేకాట స్థావరంపై సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ, రైటర్‌లు దాడిచేశారు. అయితే జూదరులను అరెస్ట్‌చేసి, అక్కడ దొరికిన నగదును సీజ్ చేయాల్సిన సదరు అధికారులు ఇద్దరు వారితో బేరసారాలకు దిగారు. చర్చల అనంతరం రూ.50వేలు పుచ్చుకుని వారిపై కేసు నమోదుచేయకుండా వదిలివేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్‌ను వివరణ కోరగా అలాంటిదేమీ లేదని, దాడులు నిర్వహించలేదంటూ దాటవేయడం విశేషం. అయితే దాడులు జరిపి రూ.50వేలు తీసుకుని వదిలివేసిన విషయం రూరల్ సీఐ దృష్టికి వెళ్ళడంతో సిబ్బందిని నిలదీసినట్లు తెలిసింది. గతంలో ఎర్రకొండ సమీపంలోని ఓ నివాసంలో పేకాడుతుండగా పోలీసులు దాడులు నిర్వహించి భారీగానే నగదును స్వాధీనం చేసుకున్నారు. అయితే స్వాధీనం చేసుకున్న మొత్తంలో 20శాతం మాత్రమే చూపించి కేసు నమోదు చేశారు. అలాగే విశ్వనాధుని కండ్రిక, వంకాయలపాడు పరిధిలోని యూకలిప్టస్ తోటల్లో పేకాడుతూ పట్టుబడిన వారి నుంచి కూడా అధిక మొత్తంలో నగదును స్వాధీనం చేసుకుని తక్కువ చూపి మిగిలిన మొత్తాన్ని నొక్కేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాకుండా ఇంటిలిజెన్స్ సిబ్బందిని తనకు తెలియకుండా ఎక్కడికీ వెళ్ళవద్దని, ఒకవేళ వెళితే చెప్పి వెళ్ళాలని ఎస్ఐ హుకుం జారీచేసినట్లు తెలుస్తోంది.

12 మంది రక్తదానం

చిలకలూరిపేట, మే 20: సినీ నటుడు జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గణపవరంనకు చెందిన జూనియర్ ఎన్‌టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో స్థానిక ఏరియా వైద్యశాలలో సోమవారం రక్తదాన శిబిరాలు నిర్వహించారు. 12మంది అభిమానులు రక్తదానం చేశారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీకుమారి, ఆర్ఎంవో డాక్టర్ అమృతవల్లి, బ్లడ్ బ్యాక్ సిబ్బంది రక్తదానం చేసిన వారిని అభినందించారు. కాగా జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదిన సందర్భంగా వృద్ధులకు అన్నదానం కూడా చేశారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, మే 20: పట్టణంలోని టౌన్-2 పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ సోమవారం తెలిపారు. సీఆర్ కాలనీ, రజక కాలనీ, ఏఎంజీ డొంక తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తారని తెలిపారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి

చిలకలూరిపేట, మే 20: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, జన విజ్ఞాన వేదికల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలను గుర్తుకు తెచ్చుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పీవీ సుబ్బారావు, చుక్కా విన్సెంట్‌పాల్, ఉప్పాల భాస్కరరావు, కస్తూరి వెంకటేశ్వర్లు, ఎం.నాగుల్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

● నాదెండ్ల గ్రంథాలయ అధికారి రావూరి శ్రీనివాసరావు

నాదెండ్ల, మే 20: విద్యార్థులు వేసవి సెలవుల్లో విజ్ఞాన్ని పెంపొందించుకునేందుకు ఉపయోగించుకోవాలని నాదెండ్ల గ్రంథాలయ అధికారి రావూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పుస్తక పఠనం విజ్ఞాన్ని పెంపొందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. వేసవి సెలవులను విద్యార్థులు ఉపయోగించుకొని క్రమశిక్షణమార్గంలో నడుచుకోవాలన్నారు.

నూజెండ్లలో చోరీ

నూజెండ్ల, మే 20: మండల కేంద్రం నూజెండ్లలో ఆదివారం రాత్రి చోరీ జరిగిన సంఘటనలు బంగారం, వెండితో పాటు నగదు దొంగిలించారు. గ్రామానికి చెందిన చిట్టే సుబ్బారావు గృహంలో ఇంటి వెనుకవైపు తలుపు గడియ తొలగించి ఇంట్లోని బంగారం రెండున్నర శౌరి, పది తులాల వెండి పట్టాలు, రూ.16వేలు నగదు చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

నూజెండ్లలో కొనసాగుతున్న 144 సెక్షన్

నూజెండ్ల, మే 20: మండల కేంద్రం నూజెండ్లలో ఎన్నికల అనంతరం జరిగిన ఘర్షణల నేపథ్యంలో గత ఏడు రోజులుగా 144 సెక్షన్‌ను అమలు చేసి గ్రామంలో పోలీసు పికెట్‌ను కొనసాగిస్తున్నారు. దీంతో గ్రామంలో చిరు వ్యాపారులు దుకాణాలను మూసి వేయటంతో గ్రామంలోని, మండల కేంద్రానికి వచ్చిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ద్విచక్ర వాహనం దహనం

మాచర్లటౌన్, మే 20: పట్టణంలోని 22వ వార్డులో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పంటించి దహనం చేశారు. మహంకాళి పిచ్చయ్య తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి సమయంలో కేకలు వినపడడంతో బయటకు వచ్చి చూడగా ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ బ్రహ్మయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



దహనమైన ద్విచక్ర వాహనం